Whatsapp No: 9440662699 www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

Voice of Voiceless








అమరావతి సంపుటి : 2 సంచిక 48, పేజీలు 8 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 21- ఆదివారం 27, ఆగస్టు-2017


# ఎన్నికల కోలాహలం

**రా.వా.ప్రతినిధి– అమరావతి :** నంద్యాల ఎన్నికల్లో అధికార, విపక్ష సభ్యులు చావోరేవో అన్నట్లు పోటీ పడుతున్నారు. డబ్బుల కట్టలు పంచుతున్న ఇరుపార్టీలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారు. కోట్లరూపాయలతో బెట్టింగులు జరుగుతున్నాయి. ఎన్నికల సర్వేలో పేరుగాంచిన లగడపాటి రాజగోపాల్ సర్వే నివేదికను ఎన్నికల అనంతరం బయట పెడతానన్నారు. నిన్నటిదాక ఈగలు తోలుకుంటున్న హోటళ్లు ఎన్నికల పుణ్యమా అని రద్దీతో ఉన్నాయి. బిర్యానీకి గిరాకీ పెరిగింది. వైన్‌షాపులూ, బార్లూ కళకళలాడుతున్నాయి. హిందూపురం నుంచి తెలుగుదేశం ఎమ్మెల్యేగా ఎన్నికైన బాలకృష్ణ డబ్బులు పంచుతున్నారని విపక్ష మీడియా ప్రచురించగా, విపక్షాలకు


నంద్యాలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సీఎం చంద్రబాబు


ఫ్యాన్ గుర్తుతో ప్రచారం చేస్తున్న వైఎస్ జగన్

చెందిన వ్యక్తి నాలుగున్నర లక్షల రూపాయలు పంచడానికి తీసుకు వెళు తుండగా పోలీసులు అరెస్టు చేశారని అధికార పక్షం చెబుతోంది. ఒక్కో ఓటుకు రూ.5 నుంచి 10,వేలవరకు అధికారపార్టీ అందచేసి పోలింగ్‌లో పాల్గొన వద్దని ఓటర్లను కోరుతోందని ప్రతిపక్షం విమర్శిస్తోంది. నంద్యాల ప్రజలకంటే ప్రస్తుతం ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వచ్చిన వివిధ సామాజిక వర్గాలతో పట్టణం నిండి పోయింది. అధికార,ప్రతిపక్షాల్లో ఒకరిపై ఒకరి నిఘా పెరిగింది. దీనిలో విపక్షపాత్ర ఎక్కువగా ఉండగా, అధికారపక్షం పోలీసులు అధికారులను వినియోగించు కుంటోందని వైసీపీ ఆరోపిస్తోంది. ఈనెల 23న నంద్యాల ఎన్నికలు జరుగుతుండగా, ఫలితాలను 28న ప్రకటిస్తారు.




## నంద్యాల ఎన్నికతో పాలన పడక

అసలే ఐదురోజుల పనిదినాలు, ఉద్యోగుల హైదరాబాద్ – అమరావతి షటిల్ సర్వీసులతో అంతంతమాత్రంగా ఉన్న సచివాలయ పరిపాలన నంద్యాల ఎన్నికల పుణ్యమా అని పూర్తిగా పడకేసింది. తమగోడు చెప్పుకోవడానికి ఉత్తరాంధ్ర నుంచి అనంతపురం వరకు ఉన్న ప్రజలు అనేక కష్టనష్టాలకు ఓర్చి సచివాలయానికి వస్తే పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయనాయకులు భారీగా అక్కడికి తరలివెళ్లడంతో ఇక్కడి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. నిజానికి నంద్యాల సిట్టింగ్ ఎమ్మెల్యే భూమానాగిరెడ్డి మరణంతో ఈ ఉప ఎన్నికలు జరుగుతున్నా, అది పూర్తిస్థాయి ఎన్నికలమాదిరి అధికార, ప్రతిపక్షపార్టీలు హోరాహోరీగా తలపడుతూ


- మిగతా 2 లో


# వరినాట్లు ముమ్మరం



- జిల్లా వ్యాప్తంగా వర్షం
- 3.50లక్షల హెక్టోర్లులో వరినాట్లు లక్ష్యం

**రా.వా.ప్రతినిధి– విజయవాడ:** జిల్లావ్యాప్తంగా వర్షాలు పడటంతో రైతులు ఊరట చెందారు. పట్టిసీమ నీటి కోసం ఎదురుచూసి భంగపాటుకు గురైన శివారు రైతులకు వర్షం ఊపిరి పోసింది. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో జిల్లాలో తేలికపాటి జల్లులు పడ్డాయి. అక్కడక్కడా కొద్దిపాటి భారి వర్షమూ కురిసింది. పశ్చిమ కృష్ణా, తూర్పు కృష్ణా ప్రాంతంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వారం రోజులపాటు నిలకడగా వర్షం కురిస్తే.. జిల్లాలో ఆశించిన స్థాయిలో వరినాట్ల లక్ష్యం పూర్తివుతుందని అధికారులు భావిస్తున్నారు. తీరప్రాంత రైతాంగానికీ ఈ వర్షం మేలుచేయనుంది. పట్టిసీమ నీళ్లు కాల్వల ద్వారా జిల్లాకు వచ్చినప్పటికీ, శివారు ప్రాంతాలకు దరిచేరలేదు. దీంతో రైతులంతా అభద్రతా భావానికి గురయ్యారు. గత రెండు రోజులుగా పెడన, అవనిగడ్డ, మచిలీపట్నం, మైలవరం గుడివాడ, కైకలూరు ప్రాంతాల్లో పడుతున్న వర్షాలతో.. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. విజయవాడ, గుడివాడ, నూజివీడు మచిలీపట్నం డివిజన్ల పరిధిలోని మండలాల్లో కురిసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 50 వేల హెక్టార్లలో వరినాట్లు వేయించాలని అధికారులు లక్ష్యంతో ఉండగా..ఇప్పటివరకూ మెట్ట ప్రాంతమైన నూజివీడు, తిరువూరు ప్రాంతాల్లో వరినాట్లు పూర్తియ్యాయి. ఇటీవల వరకూ పట్టిసీమ నీరు కాల్వల ద్వారా నీటి కోసం రైతులు వంతుల వారీగా ఆధారపడ్డారు. ఈ పద్ధతిలో మోటారు


- మిగతా 2 లో


## త్వరలో రూ.50 నోటు : ఆర్‌బీఐ




**ముంబయి :** రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) త్వరలో నీలి రంగు రూ.50 నోట్లను ప్రవేశ పెట్టనుంది. మహాత్మ గాంధీ (నూతన) సిరీస్‌లో భాగంగా ఈ నోట్లను తీసుకురానున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేనా ఈ నోటు వెనుకవైపు హంపి రథాన్ని ముద్రించనున్నారు. ఫ్లోరోసెంట్ నీలి


- మిగతా 2 లో


## 21న సూర్యగ్రహణం



**మయామి :** అమెరికాలో ఈ నెల 21న సంపూర్ణ సూర్య గ్రహణం చోటుచేసుకోబోతోంది. ఈ శతాబ్ధంలో ఈ దృశ్యం కనబడటం ఇదే తొలిసారి కావడం విశేషం.'అమెరికా మహా గ్రహణం' గా పిలిచే దీని నీడ దాదాపు దేశం మొత్తంపై పడుతుంది. ఇది వాయువ్య మూల అయిన ఒరెగాన్ నుంచి ఆగ్నేయ మూల అయిన దక్షిణ కరోలినా తీరం వరకు సాగుతుంది. అమెరికాలో 1991లో చోటుచేసుకున్న సంపూర్ణ సూర్య గ్రహణం ఒక్క హవాయ్ దీవిలోనే


- మిగతా 2 లో








# రాజధాని వార్తలు

కలం

## జగన్ దూకుడు

ప్రతిపక్షనేత జగన్ దుందుడుకుగా వ్యవహరిస్తూ ఎమ్మెల్యేలను కొని, ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చని ముఖ్యమంత్రిని చంపాలి, ఉరివేసినా తప్పులేదు లాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. నిజానికి మూడేళ్లుగా ఇదే దూకుడును అసెంబ్లీ సాక్షిగా అధికార పార్టీ చేసింది. పాతేస్తాం.. అందుచూస్తాం.. లాంటి పదాలతో మంత్రులు వైసీపీ ఎమ్మెల్యేలను , జగన్‌ను ముప్పతిప్పలు పెట్టారు. అంతేకాదు 16 నెలలు జైల్లో ఉన్నాడు.. ఎప్పటికైనా జైలుపక్షే లక్షకోట్లరూపాయలు దిగమింగాడు లాంటి మాటలతో వైసీపీని ఆత్మన్యూన్యతలోకి వెళ్లేట్లు చేశారు. అయితే ఒక్కసారిగా పరిస్థితి మారింది. ఎన్నికల కమిషన్ 'చంపాలి' అనే మాటపై వివరణకోరినా జగన్ రెండోరోజుకూడా అదే ధోరణిని కొనసాగించడం ప్రత్యర్థి వర్గంలో ఆశ్చర్యాన్ని, భయాన్ని కలిగిస్తోంది.


జగన్‌దూకుడు ప్రదర్శించడానికి చాలా కారణాలు ఉన్నాయి. ఒకటి ప్రధాని మోదీ ఏడాదిగా చంద్రబాబుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదు. అదే సమయంలో జగన్‌తో బీజేపీ మంతనాలు జరుపుతోంది. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకన్నా, వైసీపీకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న అంచనాతో కూడా బీజేపీ వర్గాలు ఉన్నాయన్న వార్తలు ఉన్నాయి. అసలు మొదటి నుంచి చంద్రబాబుతో కొనసాగడం ఇష్టం లేకపోయినా వెంకయ్యనాయుడు మూలంగా జతకట్టవలసి వచ్చిందని బీజేపీ వర్గాలు చెబుతుండగా, చంద్రబాబును వదిలించుకునేందుకే వెంకయ్యనాయుడును వైస్ ప్రసిడెంట్‌గా పంపారన్న వాదనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జగన్ అధికారపార్టీపై విరుచుకుపడుతున్నట్లు రాజకీయవేత్తలు విశ్లేషిస్తున్నారు. అంతేకాకుండా ఏకపక్షధోరణితో అమరావతిలో రాజధాని నిర్మాణం జరుగుతోందని, ఇంతవరకు కేంద్రం కేటాయించిన నిధులకు లెక్కాపత్రం లేకుండా పోవడంపై కూడా ప్రధాని, ఆర్థికమంత్రి గుర్రుగా ఉన్నారని తెలుస్తోంది. దీంతో కేంద్రం నుంచి బాబుకు ఎటువంటి సాయం అందబోదన్న భరోసా వైసీపీలో ఉండటం, గతంలో మోదీ విజయానికి తోడ్పడిన ప్రశాంత్ కిషోర్‌ను జగన్ తమ మెంటార్‌గా వినియోగించుకోవడం కూడా వ్యూహాత్మక దాడికి కారణంగా పేర్కొవచ్చు.

తమ సీటును మళ్లీ దక్కించుకోవాల్సిందే అనే పట్టుదలతో జగన్ అక్కడ మకాం వేసి మరీ ఎన్నికలను పర్యవేక్షిస్తుండగా, ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధికార పార్టీ గెలుపుకోసం సమస్త శక్తియుక్తులను వినియోగిస్తోంది. మూడేళ్లపాటు మైనార్టీ మంత్రిని నియమించని చంద్రబాబు ముస్లిం ఓట్లను దృష్టిలో పెట్టుకొని ఆదరాబాదరాగా మాజీ ఎమ్మెల్యే ఫరూక్‌కి ఎమ్మెల్సీ, నౌమన్‌కు కార్పొరేషన్ ఇచ్చి ఆ సామాజిక వర్గాన్ని మచ్చికచేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాదు గ్రామాలు, వార్డులు,బూత్‌ల వారీగా ప్రచారాన్ని ముమ్మరం చేసారు. నంద్యాల్లో సుమారు 2 లక్షల మంది ఓటర్లు ఉండగా 51,802 ముస్లింలు, 51,802 మంది రెడ్లు, 6,455 మాల, 12,085 బలిజ, 12,307 మాదిగ, 10121 వైశ్య, 9,209 బోయ, 6593 యాదవ, 5647 దూదేకుల,4940 రజక ఓట్లు ఉన్నాయి. కులసమీకరణలు చేసి రెండు వర్గాలు భీకరంగా తలపడుతున్నాయి. 19 నుంచి చంద్రబాబు రంగంలో దిగనున్నారు. బాలకృష్ణ పర్యటన ముగిసింది. పవన్‌కల్యాణ్ ప్రచారానికి దూరంగా ఉండటం, మంత్రి ఆదినారాయణ ఎస్సీఎస్టీలపై చేసిన కుంచిత వ్యాఖ్యలు అధికారపార్టీకి అనుకోని అవాంతరాలే..

నంద్యాల్లో వైసీపీ గెలిస్తే రాష్ట్రంలో తెలుగుదేశం హవా పోయిందని వైసీపీ, తెలుగుదేశం విజయం సాధిస్తే ప్రజలు అధికారపార్టీకే పట్టంకట్టారని అధికారపార్టీ 2019 ఎన్నికలకు సిద్ధం కావాలని కలలు గంటున్నాయి. అందుకోసం ఇరుపార్టీలు ఓటర్లను నోట్లతో బుజ్జగించాలని చూస్తున్నారు.

నిజానికి 13 ఏళ్ల నుంచి నంద్యాల్లో టీడీపీకి స్థానం లేదు. మొదటి నుంచి అది కాంగ్రెస్ అడ్డాగా ఉంది ఆపై అఖిలప్రియ తల్లి శోభానాగిరెడ్డి వైసీపీలో చేరడంతో అక్కడ ఆపార్టీ విజయం సాధించింది. అయితే భూమానాగిరెడ్డి, అఖిల ప్రియలు వైసీపీకి బై చెప్పి తెలుగుదేశంలో చేరడం.. తెలుగుదేశంపార్టీ నుంచి శిల్పానాగిరెడ్డి ఈ ఎన్నికల ముందు వైసీపీ లో చేరడం.. అంటే అంతకు ముందు ఓడిన అభ్యర్థి స్థానికంగా గెలుపుసాధించిన పార్టీలో ఉండగా, గెలిచిన అభ్యర్థి అధికారపార్టీలోకి ఫిరాయించడంతో అంతా గందరగోళంగా మారింది. 70 ఏళ్ల స్వతంత్య్ర భారత దేశంలో ఇంతవరకు ఎప్పుడు ఈ పరిస్థితి తలెత్తలేదు. మరి ప్రజలు ఏవిధంగ తీర్పునిస్తారో వేచి చూడాల్సిందే..

# మంత్రిగారూ.. నోరు శుభ్రం చేసుకోండి..



ఇతరులను చిన్నబుచ్చుతున్నామను కుంటూ మరగుజ్జు మనస్తత్వాన్ని బయట పెట్టుకున్నారు. ఆ మంత్రి. నిజానికి సమాజంలో అన్నివర్గాల ఓట్లతో గెలిచిన వ్యక్తి ఇటువంటి కుంచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయం. పదవిలో కొనసాగే అర్హత లేదు అయినా ఇంతవరకు ప్రభుత్వం దీనిపై స్పందించక పోవడం దారుణాతి దారుణం. ఎస్సీ,ఎస్టీలకు '10ఏళ్ల రిజర్వేషన్లను 70 ఏళ్లు కొనసాగించినా ఫలితంలేదు, వాళ్లు చదువుకోరు. శుభ్రంగా ఉండరు'..అంటూ గబ్బునోరు తెరిచారు ఆమంత్రివర్యులు. అదీ దేశం 71వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్నవేళ..

దేశానికి దిశ, దశ సూచించే రాజ్యాంగాన్ని కోటి సూర్యుల ప్రభ బాబా అంబేద్కర్ రూపొందించారని కూడా గుర్తుకు రాలేదా యనకు. సాటిమనిషిని, మనిషిగా గుర్తించలేని ఇలాంటి కుళ్లు రాజకీయనాయకుల భరతం పట్టడానికే ఆయన ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని రాజ్యాంగంలో పొందుపరిచారు.

నిజమే వారిలో అక్షరాస్యత తక్కువే కావచ్చు.. అది ఎవరి వైఫల్యం పాలకులది కాదా..వారి నిధులన్నీ బొక్కుతున్న ఆయన లాంటి పెద్దమనుష్యులదికాదా..ఇవి చాలవన్నట్లు స్కూళ్లు కాలేజీలు పెట్టి వియ్యంకుడు కేశవరెడ్డి రూ. 750 కోట్లు అప్పనంగా ప్రజల సొమ్ము కాజేస్తే ఆయన కొమ్ముకాస్తున్న మంత్రి చదువు గొప్పచదువు మరి. ఒకపార్టీలో గెలిచి మరొక పార్టీకి జంప్ చేసే ఈయన శుభ్రత గురించి మాట్లాడటం. విద్య వినయాన్ని, మానవత్వాన్ని పెంచాలి అది లేని విద్యకు విలువలేదు.. వెకిలిమాటలతో వెగటు పుట్టించే మంత్రివర్యులు ముందు నోరు శుభ్రం చేసుకొని ఎదుటివారి శుభ్రత గురించి మాట్లాడితే బాగుంటుంది. చదువంటే సంస్కారాన్ని ఇవ్వాలి, నీతి నిజాయితీలు ఇవ్వాలి. ఇదేమిలేని వారు చదువుగురించి మాట్లాడి దాని విలువ తీస్తున్నారనడానికి ఈ మంత్రే ఉదాహరణ.

మంత్రిని భౌరావ్ చేయడం,దిష్టిబొమ్మలు తగలబెట్టడం, లేదంటే పదవినుంచి తొలగించ మనమడే పరిష్కారం కాదని గుర్తించాలి. రాష్ట్రం, కేంద్రాల్లో ఆధిపత్యం చెలాయించే కులాల నుంచి రాజ్యాధికారం పొందటానికి సమాజంలోచిన్నచూపుకు గురవుతున్న వారంతా సంఘటితమై ఇలాంటి పొగరుబోతు నాయకుల పనిపట్టాలి. కష్టం విలువ తెలియని వాళ్లు, కష్టపడటం రాని వాళ్ల మాటలు ఇలాగే ఉంటాయని ఎస్సీఎస్టీ,బీసీ, మైనార్టీలు మర్చిపోరాదు. హక్కులు వినియోగించుకుంటూ తమ అసమాన ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తూ ఇలాంటివారి నోళ్లు మూయించాలి. లేదంటే భావి పౌరులు కూడా ఇలాంటి పెద్దమనుష్యుల వ్యాఖ్యలతోనే ఆత్మన్యూన్యతకు గురవుతారు.. హేతు, ప్రజా స్వామ్య వాదులు, మేధావులు రాజనీతి శాస్త్రవేత్తలు, మానవతావాదులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే ప్రజల్లో చైతన్యం తేవాలి.

# హజ్ భవన్ కిటకిట

**హైదరాబాద్ :** యాత్రికులతో హజ్ భవన్ కిటకిటలాడుతోంది. యాత్రికులకు వీడ్కోలు పలికేందుకు బంధువులు, స్నేహితులు తరలిరావడంతో సందడిగా మారింది. ఈ నెల 22వరకు భక్తులకు హజ్ యాత్రకు పంపిచనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దాదాపు 6 వేల మంది హజ్‌కు బయలుదేరి వెళతున్నారు. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి ఒక్కొక్క బస్సులో 50 మంది చొప్పున రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలిస్తున్నారు. ప్రతిరోజూ 450 మంది హజ్‌యాత్రికులతో ప్రతి విమానం బయలుదేరుతుంది.



నాంపల్లిలోని హజ్‌భవన్ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ముస్లిం యాత్రికులు తరలివెళుతుండటంతో కుటంబసభ్యులు, స్నేహితులు, బంధువులతో కిక్కిరిసిపోతోంది. యాత్రికుల కోసం ఉచిత భోజన, బస, వసతి ఏర్పాట్లు చేశారు. మహిళా యాత్రికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లక్కీ డ్రాలో ఎంపికైన యాత్రికులను ప్రభుత్వ సబ్సిడీతో పలు శాఖల అధికారులు అనుమతులు ఇస్తున్నారు. 24 గంటల పాటు పోలీసు సేవలను యాత్రికులకు అందిస్తున్నారు. విదేశీ నగదు మార్పిడి చేసుకునేందుకు యాత్రికులకు వెసులుబాటు కల్పించారు.

## నంద్యాల ఎన్నికతో పాలన పడక

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల రణరంగాన్ని గుర్తుచేస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భూమా అఖిలప్రియను కూడా కొంతమంది ఓటర్లు ఇదే విషయంపై నిలదీశారు. ఓట్లకోసం తిరిగితే మంత్రిగా మీ బాధ్యతలు ఎవరు నిర్వహిస్తారంటే నేను కూడా ఆ విషయంలో బాధపడుతున్నానంటూ అమె సమాధానం ఇచ్చారు. శనివారం నుంచి చంద్రబాబుకూడా అక్కడే మకాం వేయనున్నారు. ఒక్క నంద్యాల ఎన్నికల పోరు తమ జీవితాలను మార్చేస్తుందన్న మాదిరిగా సమస్తశక్తులు అక్కడ ఒడ్డేసి ఇక్కడ ప్రజలను పట్టించుకోకపోవడం రాష్ట్రప్రజలను తీవ్రంగా కలచివేస్తోంది. కేవలం శంకుస్థాపనలకు, ప్రారంభోత్సవంలో సరిపెట్టడమేకాని, వర్షాభావపరిస్థితుల్లో రాయలసీమ జిల్లాల్లో దిగాలుపడ్డ రైతులను పట్టించుకోకపోవడం దారుణం. వైసీపీ అభ్యర్థి శిల్పామోహనరెడ్డి సోదరుడు శిల్పా చక్రపాణిరెడ్డికూడా తన ఎమ్మెల్సీ రాజీనామ చేసి పార్టీ ఫిరాయించడంతో మళ్లీ ఎమ్మెల్సీ ఎన్నిక జరగవలసి ఉంది. అదే సమయంలో కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు 29న నిర్వహిస్తున్నారు. వీటన్నింటిపై అధికార పార్టీ శక్తియుక్తులు పెడితే పాలన పడకేసినట్లే.. సమయపాలన, చిత్తశుద్ధితో కార్యక్రమాలు నిర్వహించాలిగాని ప్రతీది ఎన్నికల విజయలక్ష్యంతో పనిచేస్తే సామాన్యుల గోడు పట్టించుకునేదెవరని ప్రజలు వాపోతున్నారు.

# వరినాట్లు ముమ్మరం

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా నీరు పొలాల్లోకి రానందున వారంతా నాట్లు వేసేందుకు ముందడుగు వేయలేదు. కాలువ శావారు పొలాల్లో దాదాపు లక్ష హెక్టార్ల వరినాట్లు మందకొడిగా కొనసాగుతుండా ఈ వర్షం రాకతో అక్కడా పనులు ఊపందు ఉంటోంది. దానికి తోడు వర్షాలు పడటం వల్ల పశ్చిమ కృష్ణా రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఒక్కసారిగా వర్షాలు పడటంతో వివిధ డ్రెయిన్ల నుంచి కాల్వల్లోకి నీరు ప్రవహిస్తోంది. వారం రోజుల పాటు వర్షం పడితే.. జిల్లాలో వరినాట్లు పూర్తివుతాయని రైతులు ఆశిస్తున్నారు. ఈ వర్షం వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉందని వారు పేర్కొంటున్నారు. కాల్వల ద్వారా పట్టిసీమ నీటిని నమ్ముకుంటే తామతీవ్రంగా నష్టపోయేవారమని వాపోతున్నారు.

## 21న సూర్యగ్రహణం

(మొదటిపేజీ తరువాయి)

కనిపించింది. 1979లో సంభవించిన మరో సూర్యగ్రహణం వాయువ్య రాష్ట్రాలకే పరిమితమైంది. సంపూర్ణ సూర్యగ్రహణం అమెరికా అంతటా కనిపించడం అరుదు. చివరిసారి ఇలా 1918లో జరిగింది. ఒరెగాన్‌లోని లింకన్‌బీచ్‌లో ఉదయం 9.05 గంటలకు ఈ గ్రహణాన్ని తొలుత చూడొచ్చు. మధ్యాహ్నం 2.48 గంటలకు దక్షిణ కరోలినాలోని చార్లెస్‌టన్‌లో చివరిసారిగా కనబడుతుంది. సూర్యుడి బాహ్య వలయాన్ని అధ్యయనం చేయడానికి సంపూర్ణ సూర్య గ్రహణం ఖగోళ శాస్త్రజ్ఞులకు దోహదపడుతుంది.

## త్వరలో రూ.50 నోటు : ఆర్‌బీఐ

(మొదటిపేజీ తరువాయి)

రంగులో ఉండే ఈ నోటుకు రెండు వైపులా ఆంగ్ల, దేవనాగరి సూక్ష్మక్షరాల్లో ఆర్‌బీఐ, ఇండియా, నోటు విలువ రాసి ఉంటాయి. మహాత్మగాంధీ చిత్రం కూడా ముద్రించి ఉంటుంది. ముందువైపు కుడిదిక్కున అశోక స్తంభం చిహ్నం...నినాదం, వివిధ భాషల్లో నోటువిలువలు ఉంటాయి. కొత్త నోట్లు జారీ తర్వాత కూడా పాత రూ.50 నోట్లు చెల్లు బాటు అవుతాయని ఆర్‌బీఐ తెలిపింది.

# కృషిపట్టుదలకు 'రూప'



**రూప తన పేదరికాన్ని తిడుతూ కూర్చోలేదు. లేదంటే ఇలా రాసిపెట్టి ఉందని అందరిలా సర్దుకుపోలేదు. తనను తాను నిరూపించుకునేందుకు అహరహం కృషి చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు ఆమె సగటు భారతీయ మహిళలకు మార్గదర్శకంగా నిలిచింది.**

రాజస్తాన్‌లోని జైపూర్‌కు దగ్గర్లోని ఒక మారుమూల ప్రాంతంలో రూప యాదవ్ జన్మించింది. తల్లిదండ్రులు వ్యవసాయదారులన్న మాటేకాని ఎప్పుడూ ఇంట్లో దారిద్ర్యం తాండవించేది. అందరి పిల్లలాగే ఆమెకు కూడా ఏడోతరగతిలో ఉండగానే జైపూర్‌కు చెందిన శంకర్‌లాల్‌తో పెళ్లయ్యింది. అయినా చదువుమీద ఉన్న ప్రేమతో అత్తమామలను, భర్తను ఒప్పించి చదువుకొనసాగించింది. ఇంట్లోను, పొలంపనుల్లోనూ వారికి సాయపడుతూనే పదోక్లాసులో 84 శాతం మార్కులు తెచ్చుకుంది. ఆమె మార్కులు చూసిన భర్త,మామలు ఆమె చదువును కొనసాగించదలచుకున్నారు. అలా ఆమె ఇంటర్‌లో

## ఆమె

జాయిన్ అయ్యింది. అయితే ఆ గ్రామంలోని వారంతా ఆమె చదువుకు అభ్యంతరం పెట్టారు. పెళ్లిచేసుకొని పిల్లలను కనాలిగాని చదువంటూ కళాశాలల వెంట తిరగడమేమిటని ఆమె అత్తమామలకు నూరిపోశారు. అయినా రూప పట్టుదలను చూసి వారు బాగా చదివించాలనుకున్నారు.

ఇంటర్‌లో కూడా అత్యధిక మార్కులు రాబట్టడంతో పెద్దచదువుల చదివించాలని భర్త భావించారు. బీఎస్సీలో ప్రవేశం పొందింది. దానితో సంతృప్తిపడని ఆమె వైద్యవిద్యను అభ్యసించాలనుకుంది. అయితే ఎంట్రన్స్ టెస్టులో ఆమె మంచి ర్యాంకు సాధించలేకపోయింది. దీంతో కోటాలో కోచింగ్ ఇప్పించడం కోసం ఆమె భర్త, బావలు ఆటోలు నడిపారు. ఈ ఏడాది నీట్ ప్రవేశపరీక్షల్లో 720 మార్కులకు 602 మార్కులతో ఆలిండియాలో 2,283 ర్యాంకు తెచ్చుకుని ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు తెచ్చుకుంది. ఆమెకు ఎంట్రన్స్ కోచింగ్ ఇచ్చిన సంస్థ ప్రతినెలా ఉపకారవేతనం ఇచ్చేందుకు అంగీకరించింది. ఆమె ఆశయాన్ని నెరవేర్చినందుకు చాలా సంతోషంగా ఉందని రూప భర్త యాదవ్ చెబుతున్నారు. ఇప్పుడు దేశంలోని యువతకు రూప మర్గదర్శకంగా మారడం ఆనందదాయకం. ఆమె అభిప్రాయానికి విలువనిచ్చి ఆశయ సాధనలో చేయూతనందించిన అత్తమామలను కూడా అభినందిద్దాం.

# ఆ నదీజలాలు విషతుల్యం

- ఉద్దానం కిడ్నీ వ్యాధులకు మహేంద్ర గిరుల ప్రవాహాలే కారణం
- తేల్చిచెప్పిన ఏయూ పరిశోధనలు

ఉద్దానప్రాంతంలో కిడ్నీ వ్యాధి ప్రబలడానికి మహేంద్రగిరుల నుంచి ప్రవహిస్తున్న నదీ ప్రవాహాలే కారణమంటూ ఆంధ్ర విశ్వ విద్యాలయం నిపుణులు జరిపిన పరిశోధనల్లో వెల్లడికావడం తో ఈప్రాంత ప్రజల్లో కలవరం మొదలైంది. ఇక్కడ పండించే వరి మినహా మిగిలిన అన్ని ఉద్యాన పంటలపై దీని ప్రభావం ఉందని పరిశోధకులు గుర్తించడంతో జీవనమే ప్రశ్నార్థ కంగా మారబోతోంది. ప్రధానంగా తీరప్రాంతంలో అత్యధికంగా సాగవుతున్న కొబ్బరిపంటపై ఈ పరిశోధన ప్రభావం తీవ్రంగా కనబడే అవకాశం ఉంది. కొబ్బరి ఉత్పత్తుల్లో ఖనిజాలు మిళితమై విషత్యులంగా మారాయని పరిశోధకు లు గుర్తించారు. వీరి అభిప్రాయం ఈ ప్రాంత ప్రజల జీవనంపై దెబ్బపడుతోంది. సుమారు రెండు దశాబ్దాల క్రితం ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధిలక్షణాలు బయటపడ్డాయి.

ఈ ప్రాంతంలో అప్పట్లో తీవ్ర మంచినీటి ఎద్దడితో జనం విలవిల లాడేవారు వేసవి వచ్చిందంటే చాలు మైళ్ల కొద్దీ నడిచి వెళ్లి పంట పొలాల్లో తువ్వుకున్న నేలబావులనుంచి తాగునీరు తెచ్చుకునే వారు. 150 అడుగులు తవ్వినా నీరు లభించని దుస్థితి. ఇసుక నేల కావడం వల్ల సమీపాన గల సముద్రపు నీరు బావుల్లోకి చేరి ఉప్పునీరే తాగు అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి ఉంది. అర్ధరాత్రి మంచినీటి కోసం బావుల వద్ద పడిగాపులు కాసే రోజులు ఉండేవి. ఇక్కడి ప్రజలు కష్టాలను ప్రజాప్రతినిధులకు ఏకరవు పెట్టేవారు. దీంతో కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉద్దాన ప్రజల తాగునీటి ఎద్దడి నివారణా చర్యలు చేపట్టేందుకు స్వర్గీయ కింజరపు ఎర్రన్నాయుడు కేంద్ర ప్రభుత్వ నిధులతో మహేంద్ర తనయ నది నుంచి తాగునీటి అవసరాలకు నీటిని మళ్లించేందుకు భారీ తాగునీటి రక్షిత మంచినీటి పథాకాన్ని మంజూరు చేయించారు.

ఈపథకం వచ్చాక కష్టాలు తీరిపోయాయని ఇక్కడి ప్రజలు ఎంతో సంతోషించారు. కానీ పథకం ద్వారా నీరు అందించడానికి తవ్విన బావులు ఉద్దాన ప్రాంతానికి నీటితో పాటే నిక్షిప్తమైన భార ఖనిజాలు నీటితోపాటే సరఫరా అయినందున ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధి ఈ ప్రాంతంలో రెట్టింపు అయ్యిందని స్థానికులు అనుమానిస్తున్నారు.

## ఇకపై పద్మ అవార్డుల కోసం
# ఎవరైనా నామినేట్ చేయవచ్చు



**న్యూఢిల్లీ :** వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పద్మ అవార్డులను ఎవరి కివ్వాలో ప్రజలెవరైనా ప్రతిపాదించవచ్చని కేంద్రం తెలిపింది. ఈ మేరకు 2018 ఏడాదికి పద్మ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ కేంద్ర హోంశాఖ ప్రకటన విడుదల చేసింది. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్ , వాణిజ్యం తదితర రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ అవార్డు అందజేస్తారు. 'పద్మ అవార్డుల నామినేషన్లు స్వీకరించడానికి చివరతేదీని సెప్టెంబర్ 15గా నిర్ణయించాం. ప్రజల్లో ఎవరైనా పద్మ అవార్డుల కోసం ఎవరి పేర్లయినా ప్రతిపాదించవచ్చు. దీనివల్ల వెలుగులోకి రాని చాలా మంది అర్హులైన వ్యక్తులను సరైన గుర్తింపు' అని హోంశాఖ ఆ ప్రకటనలో పేర్కొంది, ప్రజలందరూ తమ ప్రతిపాదనలను అధికారిక వైబ్‌సైబ్ www.padmaawards.gov.inకు పంపాలని కోరింది. కేవలం ఆన్‌లైన్ ద్వారానే ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. సామాన్యులతో పాటుగా రాష్ట్ర ప్రభుత్వాలు, సీఎంలు, గవర్నర్లు, మంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాలు, భారత రత్న, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీతలు కూడా పద్మ అవార్డు కోసం వ్యక్తుల పేర్లను ప్రతిపాదించవచ్చని హోంశాఖ వెల్లడించింది. ప్రధాని మోదీ నియమించిన పద్మ అవార్డుల కమిటీ అవార్డుల ప్రధానంపై తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపింది. గతంలో రాజకీయ నేతలు, మంత్రులు సిఫార్సు చేసిన వారికే పద్మ అవార్డులు అందేవి.

# మిన్నంటిన బంగారం ధర




**ఢిల్లీలో రూ.30,000 దాటిన ధర**

**న్యూయార్క్ - ముంబై :** ఆమెరికా సెంట్రల్ బ్యాంకు- ఫెడరల్ రిజర&్వ ఈ ఏడాది ఒక ఫండ్ రేటును ( పస్తుత శ్రేణి) 1-1.25 శాతం) పెంచే అవకాశం లేదన్న అంచనాలు బంగరానికి బలాన్ని ఇస్తున్నాయి. దీంతో అంతర్జాతీయంగా కమోడిటీ ఎక్స్ఛేంజ్ -నైమెక్స్‌లో ఔన్స్(31.1గ్రా) దర గురవారం ఒకదశలో బుధవారం ముగింపుతో పోలిస్తే 12 డాలర్లు పెరగి 1.295 డాలర్లకు చేరింది. గురువారం డిల్లీ మార్కెట్‌లో పుత్తడి తిరిగి రూ.30,000 స్థాయికి అధిగమించింది. 99.9 స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర ఢిల్లీలో రూ.30,050 వద్ద ముగిసింది. ముంబై స్పాట్ మార్కెట్‌లో 99.9 స్వచ్ఛత 10 గ్రాములు పసిడి ధర రూ.305 పెరిగి రూ.29,110కి ఎగసింది. 99.5 స్వచ్ఛత ధర కూడా అంతే ఎగసింది. రూ.28,960కి చేరింది. వెండి కేజీ ధర రూ.745 పెరిగి రూ.39,000 కి ఎగసింది. కడపటి సమాచారం మేరకు ఫ్యూచర్స్ మార్కెట్ - మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో చురుగ్గా ట్రేడవుతున్న పసిడి కాంట్రాక్ట్ ధర రూ.200 లాభంతో రూ. 29,150 వద్ద ట్రేడవుతుంది. వెండి రూ.250 లాభంతో రూ.39,100 వద్ద ట్రేడవుతుంది.

# అధిక ఆలోచనలతో అనారోగ్యం

పార్టు 10



Dr. DWIBHASHYAM KASI VISHWANATH TEJASWI
B.A.M.S
CHINTALURU AYURVEDA PHARMACY
9032990138/ 9393990138
email:
dr.d.vishwanath@gmail.com

**హైపర్ టైన్షన్ (హై.బి.పి) :** దీనిని రక్తపోటు అంటారు. ఇది 18 సం॥ పైబడినవారిలో వచ్చే అవకాశం వుంది. ఇది ఎక్కువగా వంశపారంపర్యంగా వస్తుంది. మానసిన వత్తిడి, ఎక్కువగా ఆలోచించటం, ఉప్పు కారాలు ఎక్కువగా వాడటం, ఆహారంలో క్రొవ్వు శాతం అధికంగా వుండటం, ఆల్కహాల్ ఎక్కువగా తీసుకోవటం ఇవి కారణాలు (బి.పి. రావటానికి).

దీన్ని అశ్రద్ధ చేస్తే (మందులు వాడకపోయినట్టయితే) పక్షవాతం, షుగర్ వ్యాధిచ కిడ్నీ ప్రాబ్లమ్ (మూత్ర పిండాల వ్యాధి) గుండెపోటు వస్తాయి.

**నివారణ :** ఆహారంలో ఉప్పు శాతం తగ్గించటం, మానసిన ఆందోళన చెందటం మానేయాలి. ఒకసారి బి.పి వచ్చిన వారు ఎట్టి పరిస్థితిలోనూ మందులు మానకూడదు. పత్యం కూడా చేయాలి. మామూలు వ్యక్తులకు ఈ బి.పి 120/80 వరకు వుంటుంది. బి.పి. వున్నవారిలో 120/80 కి మించి వుంటే దాన్ని హైపర్ టెన్షన్ అంటారు. పై సంఖ్య (120)ని సిస్టోలిక్ అని, క్రింద సంఖ్య (80) ని డయాస్టోలిక్ అని అంటారు. ఇవి కాకుండా ఇంకా ఆస్తమా, ఎలర్జీలు, డిప్రెషన్, సోరియాసిన్, అల్సర్లు, నెర్వెస్‌నెస్, లివర్ సమస్యలు, ఇలా ఎన్నో రకాల జబ్బులు మనిషిని స్థిమితం లేకుండా చేస్తున్నాయి. వీటన్నిటికీ మూలకారణం మనలోని రాగద్వేషాలు, ప్రతీకార వాంఛలూ ఎక్కువైనపుడు పై రోగాలు ఎక్కువగా వచ్చే అవకాశం వుంది.

**1) స్కాల్ప్ (మాడు) :** మాడుపై ఎక్కువ ఒత్తిడి కలిగినపుడు తలపై చర్మం బిగుసుకు పోయి తలనొప్పి రావటం, జట్టు రాలిపోవటం, ఎక్కువగా కోపం రావటం జరుగుతూ వుంటుంది. తరచూ ఈ కోపాన్ని అణచిపెట్టటం వల్ల మైగ్రేన్ వస్తుంది.

**2) సైనస్ :** ఈ గ్లాండ్స్ ముక్కులో వుంటాయి. వాతావరణంలో చల్లదనం వల్ల, చల్ల నీటివల్ల, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ అతిగా తీసుకోవటం వల్ల ముందుగా జలుబు వచ్చి, అది రాను రాను సైనస్‌గా మారటానికి అవకాశం వుంది. మెంటల్ టెన్షన్ వల్ల కూడా ఈ సైనస్ రావటానికి అవకాశం వుంది.

**3) మెడనొప్పి :** పాపం ఈ రోజుల్లో చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతి వారిని చాలా బాధపెడుతోంది. ముఖ్యంగా కాన్వెంటు పిల్లలు వారి బ్యాగ్‌ను వీపుమిద మోసుకు వెళ్లున్నారు. వారి ఎముకలు పెద్దవారి ఎముకల్లా పటిష్టంగా వుండవు. దాంతో ఎముకలు (మెడలో, వెన్నులో) దెబ్బతింటాయి. ఒక వుద్యోగాలు చేసేవారు, ఇంట్లో ఉండి ఎక్కువ సమయం టి.వి.లతో గడిపేవారికి, కూర్చునే విధానం సరిగ్గా లేకపోయినా, తలక్రింద దిండు బాగా ఎత్తుగా వున్నా, పడుకునే విధానం సరిగ్గా లేకపోయినా మెడనొప్పి వస్తుంది. దీన్ని అశ్రద్ధ చేసినట్టయితే చాలా బాధపడవలసి వస్తుంది. అంతేకాకుండా ఇది ముదిరితే స్పాండిలైటిస్ వస్తుంది.

**4) స్పాండిలైటిస్ :** అదే పనిగా పనిచేయటం, సరయిన వ్యాయామం లేకపోవటం, ఎక్కువగా కంప్యూటర్ చేయటం, తలవంచి చేసే పని ఎక్కువగా వుండటం వల్ల, విపరీతమైన మానసిక ఒత్తిడికి లోనవటం వల్ల వెన్నుసాముపై. నరాలపై ఒత్తిడి పెరిగి అందువల్ల అనేక సమస్యలు వస్తాయి. అంతేకాకుండా మన తల భాగాన్ని, మొండెంను కలిపేది మెడ, మెడను నిటారుగా వుంచని పక్షంలో మెడలోని నొప్పి




భుజంలోకి ప్రాకి ఆ నొప్పి చెయ్యి మొత్తం వ్యాపిస్తుంది. దీనినే "సర్వైహికల్ స్పాండిలైటిస్" అంటారు. ఇది ఎక్కువగా రావటానిరి మెడలో ఎముకల పెరుగుదల కూడా కావచ్చు. దీని లక్షణాలు కళ్ళు తిరగటం, తిమ్మిర్లు, భుజాలు, చేతివేళ్ళలో స్పర్శ తెలియపోవటం, మూత్ర విసర్జనలో నియంత్రణ లేకపోవటం, మానసిక వత్తిడి, చెవులో శబ్దాలు రావటం, ఇవన్నీ దీని ముఖ్య లక్షణాలు.



# మైనార్టీలపై మీడియా వివక్ష



మతోన్మాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన అక్‌లాఖ్,రోధిస్తున్న కుటుంబం

ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు ఒక వర్గం గుత్తాధిపత్యంలో ఉండటంతో దేశంలోని అన్ని వర్గాల వార్తలు ప్రచురణకు నోచుకోవడంలేదని, ఒక వర్గానికి చెందిన వార్తలతోపాటు వారు చెప్పేదే నిజమని నమ్మించడానికి మీడియా శాయశక్తులా ప్రయత్నిస్తోందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచం మొత్తంలో అత్యంత అవినీతికర మీడియా భారతదేశానిదేనని రిపోర్టులు వెల్లడిస్తున్నాయి. రాజకీయపార్టీలు, మతసంస్థలతో మీడియా కుమ్మక్కు కావడమే ఇందుకు కారణంగా పేర్కొన్నాయి.

ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తుందంటే మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ తన చివరి ప్రసంగంలో దేశంలోని ముస్లింలు అభద్రతాభావంలో ఉన్నారన్న ఒక్క వ్యాఖ్యతో నూతనంగా ఎన్నికైన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో సహా మీడియా అంతా ఆయనపై కత్తికట్టి 10 ఏళ్ల పదవిననుభవించి ఇలాంటి భావాన్ని వ్యక్తం చేస్తారా అని మండిపడుతున్నాయి కాని, వాస్తవాన్ని ఒప్పుకోవడంలో వెనకడుగు వేస్తేన్నాయి.

బరాక్ ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉండగా ప్రధానిమోడీ అమెరికా వెళ్లినప్పుడు అక్కడి విలేకర్లంతా అసహనం, దేశంలోని మేథావుల అవార్డుల తిప్పివేతపై ప్రశ్నిస్తే మోడీ ఉక్కిరి బిక్కిరి అయిన విషయం ఇక్కడ వామపక్ష పత్రికలు మాత్రమే బయటపెట్టాయి. మిగతా పత్రికలన్నీ డాంబికాలు రాసిన విషయం తెలిసిందే..

దేశంలో ఇంతకుముందెన్నడూ లేని విధంగా ప్రజలకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలేకుండా పోయినమాట వాస్తవం. హన్సారీ వ్యాఖ్యలపై స్పందించిన ఆర్ఎస్ఎస్ నాయకుడు అభద్రతగా ఉంటే అన్సారీని పాకిస్తాన్‌కు వెళ్లండి, లేదా మీకిష్టమైన దేశం వెళ్లండి అంటూ హుంకరించడాన్నే ఉదాహరణగా చూపవచ్చు. **తరతరాలుగా ఈ మట్టి, ఈ గాలి , ఈ ఎండలో లో పుట్టిపెరిగి వారు ఎక్కడికో ఎందుకెళ్లాలి ?** పాక్ నుంచి ఇక్కడికి వచ్చి శాంతివనంగా ఉండే దేశంలో కులమతాలను రెచ్చగొట్టి రధయాత్రలు జరిపినవారిని ఆయన భావజాలాన్ని అనుసరిస్తున్నవారికి దేశబహిష్కరణ విధించాలి.

ఈ దేశంలో పుట్టిన ప్రతిఒక్కరికీ ఇక్కడ జీవించే హక్కుంది. అంతకుముందు లేని అభద్రత ఇప్పుడెందుకు వస్తోంది అని పాలక వర్గాలు పరిశీలించాలి. అరాచకవాదులను కట్టడి చేయాలి. అన్నిదేశాల్లోకంటే భారత్‌లోనే ఎక్కువమంది ముస్లింలు ఇక్కడ నివశిస్తున్నారని అన్నిదేశాలకంటే ముస్లింలు ఈ దేశంలోనే సౌఖ్యంగా ఉన్నారని ఉపరాష్ట్రపతి సెలవిచ్చారు. అదే నిజమైతే ప్రధాని మోడీ గోరక్షక దళాలు ఆగడాలను సహించబోమని పదేపదే ఎందుకు చెప్పవలసి వస్తోంది ? వెంకయ్యనాయుడు చెబుతున్నట్లు దేశంలోని ముస్లింలంతా సుఖసంతోషాలతో ఉంటే ఉత్తరప్రదేశ్‌లోని దాద్రిలో అఖ్‌లాక్ సంఘటన ఎలా జరిగింది ? ఫ్రిడ్జ్‌లో గొర్రె మాంసం ఉంటే కాదు గోమాంసం అంటూ హిందూ సంస్థలు అఖ్‌లాక్‌ను కొట్టి చంపిన విషయం తెలిసిందే ..అంతేకాకుండా ముగ్గురు ముస్లిం బాలురు రైల్లో మాంసం తీసుకెళుతుండగా, అదికూడా బీఫే అని వారిని కొట్టి ఒకరిని కిందకు తోసిచంపిన ఘటనపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది ? కేరళాలో ఆర్ఎస్ఎస్ కార్యకర్త హత్యకు గురైతే హెూంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, మిగతా కేంద్రమంత్రులు చేసిన హంగామా అంతాఇంతా కాదు. ఆ ఘటనను ఆ రాష్ట్ర ప్రభుత్వ శాంతిభద్రతల సమస్యగా తీసుకోకుండా ఆగ్రహం వ్యక్తం చేసేందుకు ఎంత తొందరపడ్డారు ? రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన పెడతామని ఆయన హెచ్చరిస్తాన్ని దేశంలో అందరూ సమానమే కాని ఇంకొందరు ఎక్కువ అని చెప్పడమే కదా ! దేశంలో ప్రతిరోజూ ఏదో ఒక మూల మైనార్టీలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయన్న విషయాన్ని బట్టబయలు చేసి ప్రజల ప్రాథమిక హక్కులను రక్షించాల్సిన అవసరం ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం అయిన ప్రత్రికల భాద్యత.

దేశవ్యాప్తంగా గోసంరక్షణ పేరుతో 28 మందిని అత్యంత కిరాతకంగా చంపితే అందులో 24 మంది ముస్లింలే. మిగతావారు దళితులు. ఇది ప్రపంచవ్యాప్తంగా తెలిసిన నిజం. స్టింగ్ ఆపరేషన్ నిర్వహించిన ఆంగ్లపత్రిక కిరాతకాల వెనుక అసలు నిజాలను వెల్లడిస్తూ అరాచకమూకలు గోరక్షణపేరుతో దందాలు నిర్వహిస్తూ... ఇవ్వని వారిని కిరాతకంగా










హతమారుస్తున్నాయని తెలిపింది.అసలు బీజేపీ పునాదులే మతతత్వంతో ప్రారంభించారన్నది నిజం..

**అసలేం జరిగింది ?**

**ఉపరాష్ట్రపతి వీడ్కోలు సందర్భంగా రాజ్యసభ టీవీ తరపున ప్రఖ్యాత జర్నలిస్టు కరణ్‌థాపర్ ఆయన్ను ప్రశ్నిస్తూ ముస్లింలు అభద్రతలో ఉన్నట్లు భావిస్తున్నారని, ఇది సరైనదేనా అని ఆయన్ను ప్రశ్నించగా, అన్ని వర్గాల నుంచి వస్తున్న అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటే అవునని చెప్పాల్సి ఉంటుందన్నారు. ముస్లింలు ఈ సమాజానికి చెందని వారిగా అభిప్రాయానికి వస్తున్నారా అంటే అంతదూరం వచ్చిందని నేను అనుకోవడం లేదు అని మరో ప్రశ్నకు అన్సారీ సమాధానం చెప్పారు.** అయితే మొదటి విషయాన్ని మాత్రమే పత్రికలు యాగీ చేసి రెండో జవాబును మరుగు చేయడంతో అనేక విమర్శలకు తావిస్తోంది. అయినప్పటికి ఉపరాష్ట్రపతి, ప్రధాని ఎత్తిపొడుపు పదాలకు హుందాగా సమాధానం ఇస్తూ.. 'నన్ను ఎంతగా విమర్శిస్తున్నారంటే నేను నిర్దోశినని రుజువు చేసుకోవడం దాదాపు అసాధ్యం అన్నారంటే మతతత్వ రాజకీయనాయకులు ఆయన్ను ఎంతగా గాయపరిచారో తెలుస్తుందని ఒక ఉపరాష్ట్రపతే ఆవేదన చెందితే సామాన్యుల సంగతి ఏంటి ? పదవిలో ఉండగా ఈ వ్యాఖ్యలు చేస్తే మరింత దూమారం లేపేవి, అంతేకాకుండా దేశంలోని ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహిస్తున్న బాధ్యాతాయుతమైన పదవిలో ఉండి మిగతా వర్గాల మనోభావాలను దెబ్బతీయకూడదనే ఆయన ప్రత్యక్షంగా చెప్పలేదుకాని, దేశంలో అసహనం రాజ్యమేలుతున్నప్పుడు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, మాజీ ఉపరాష్ట్రపతి హన్సారీలు ప్రజలను, ప్రభుత్వాలను ఉద్దేశించి అనేకమార్లు ప్రసంగించిన సంగతి పాత వార్తా పత్రికలు తిరగేస్తే తెలుస్తుంది.

మదరస్సాల్లో జెండావందనం కార్యక్రమం నిర్వహించి వాటిని వీడియో తీసి పంపాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఆదేశాలు జారీ చేయడం ఆ వర్గానికి అవమానం కాదా ? మేము స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి ఇప్పటివరకు జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరుపుతున్నామని, ఇదే సర్క్యులర్ మిగతా పాఠశాలలకు ఎందుకు పంపలేదని వారు ప్రశ్నించడం ? ఏ భావన కలిగిస్తుంది.

నిజానికి మొఘలాయిలు తాము ఈదేశానికి చెందినవారిగానే భావించి పాలించారు. బ్రిటీషువారు మాత్రమే జాత్యాహంకారాన్ని, భారతీయుల పట్ల చులకన భావాన్ని ప్రదర్శించారన్నది సుస్పష్టం. ఈనేపథ్యంలో పరాయి పాలనను వ్యతిరేకిస్తూ అనేకమంది ముస్లిం చక్రవర్తులు, రాజులు బ్రిటీషువారిపై తిరగబడి స్వాతంత్ర్యం కోసం

> **అంతర్జాతీయ నివేదికలు, సర్వేల ప్రకారం ప్రపంచంలోకెల్లా భారత మీడియా అత్యంత అవినీతికరమైనది. పరోక్షంగా రాజకీయపార్టీలతో అనుబంధం కలిగిఉండటమే దీనికి కారణం. ప్రజల సమస్యలపై వార్తలు కాకుండా రాజకీయనాయకుల అవసరాలకు వార్తలు చేపడుతున్నారు. విషాదకరమైన విషయం ఏమంటే వాటిని ప్రజలు నమ్ముతున్నారు. నిజాలు బయటకు రావడం లేదు. దేశంలో మీడియా మారవలసిన అవసరం ఉంది.**
> **- నివేదిక**

తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించారు. (వాటిని రాజధాని వార్తలు ప్రతివారం ప్రచురిస్తోంది.) బీజేపీలో నాటి నుంచి నేటివరకు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారు ఒక్కరు కూడా లేరు. **వీర సవార్కర్, దీనదయాళ్ ఉపాధ్యయ, వాజ్‌పేయి, వీరంతా బ్రిటీషువారిని క్షమించమంటూ మరెప్పుడూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడపబోమని లేఖలు రాసి వచ్చినవారే అన్న విషయం మర్చిపోరాదు.** చెప్పుకుంటానికి కూడా ఒక్క స్వాతంత్ర్య సమరయోధుడు లేని పార్టీ ఈదేశాన్ని పాలించడమే కాక వారు మిగతావారికి దేశభక్తి గురించి చెప్పడం, ఆదేశాలు జారీ చేయడం కొసమెరుపు.

మతోన్మాదాన్ని ఎదిరిస్తూ పుక్కింటి పురాణాలను ప్రశ్నిస్తూ ప్రజల్ని చైతన్యవంతులిగా చేస్తున్న పన్సారే,దబోల్కర్, కాల్బుర్గీలను కూడా హిందూత్వశక్తులు హత్యచేసిన విషయం ప్రపంచానికి తెలుసు.

అసమాన దేశభక్తికి,శౌర్యప్రతాపాలకు నెలవైన సైన్యంలో కూడా మతోన్మాదాన్ని నింపడానికి ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోందని ప్రముఖ వామపక్ష ఆంగ్ల వార పత్రిక 'న్యూ ఏజ్' వెల్లడించింది. గుజరాత్ మారణహెూమం తర్వాత ముస్లింలు భయాందోళనకు గురై లొంగుబాటును ప్రదర్శిస్తున్నారు. దానికి తార్కాణమే కోర్టులో వివాదాస్పద రామజన్మభూమిపై కోర్టులో ముస్లింలు ఓడినా, గెలిచినా రామనిర్మాణానికే భూమిని ఇవ్వాలన్న నిర్ణయాన్ని ఢిల్లీ ముస్లింపెద్ద చెప్పడంతోనే అర్థమవుతోంది.



హత్యకు గురైన హేతువాద మేధావులు దబోల్కర్, పన్సారే, కాల్బుర్గి



రచయిత కుర్షిద్ మొహ్మద్ కసూరీపై నల్లఇంకు పోసిని శివసేన

దేశ రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్‌కలాం ఉండగా ఎన్నడూ మత ప్రసక్తి తలెత్తలేదని ఒక వెబ్‌సైట్ పేర్కొంటూ హమిద్‌పై దుమ్మెత్తిపోసింది. అప్పటి ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయి ఇప్పటివారిలా దుందుడుకు, మతహంకార వ్యక్తి కాదని ఇప్పటి అసహనం అభద్రత ఆయన హయాంలో లేదని సదరు జర్నలిస్టులు గుర్తుంచుకోవాలి. ఆయన రాజకీయ నాయకుడిగా రాష్ట్రపతి పదవికి రాలేదు. 40 ఏళ్లు కష్టపడి శాస్త్రవేత్తగా దేశరక్షణలో అమోఘమైన పాత్ర వహించి వచ్చారు. ఆయన రాజకీయంగా కాకుండా ఇక్కడి బాలలను, యువతను సుశిక్షితులుగా చేయడం ద్వారా సమసమాజాన్ని నిర్మించవచ్చని నమ్మిన మహనీయుడు. అన్సారీ బెంగుళూరులో చేసిన ప్రసంగం ఎప్పటికీ భారతీయుల మనస్సుల్లో నిలిచి ఉంటుంది.

**జాతీయ సమైఖ్యత అంటే సయోధ్య. విభజనకాదు.. సమైఖ్యత అంటే అసమానతకాదు..స్నేహభావాన్ని కలుగ చేయడం విలీనంకాదు..ఒకరి భావాలను మరొకరు ఆమోదించడం సంఘీభావంతో సమీకృతమవడం..వివిధ వర్గాలుగా ప్రజలను వర్గీకరించడం కాదని తెలపడం ఆయన రాజనీతిజ్ఞతను, దేశభక్తిని తెలుపుతుంది.**

ఏది ఏమైనా..మేము సురక్షితంగా ఉన్నాం.. అని చెప్పాల్సింది ఇక్కడి ముస్లింలు.. పత్రికలు, రాజకీయ నాయకులు కాదు..

దేశంలో అసహనం పెరిగిపోతుందని మేధావులు రచయితలు తమ అవార్డులు తిప్పిపంపడం ఫ్యాషన్‌గా తయారైందని ఒకప్పుడు వెంకయ్యనాయుడు విమర్శించారు. ఇప్పుడు పార్టీలోనూ, పదవుల్లోనూ ఆయన లేరు కాబట్టి ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహిస్తూ అందరి మనోభావాలు కాపాడతారని ఆశిద్దాం.

**ఒక్క నిజం**

**దేశంలో ప్రజలందరికీ సమాన భాగస్వామ్యం, గౌరవాభిమానాలు అందనిరోజు ఉద్యమాలు, నిరసనలు చెలరేగుతాయి. దాంతో శాంతిభద్రతలు కరువవుతాయి. ఇది దేశాభివృద్ధిని దారుణంగా దెబ్బతీస్తుందని ప్రభుత్వాలు గుర్తించడం చాలా ముఖ్యం.**

**- హుస్సేన్ ఖాన్**

# మోడీకి మేధావుల గుడ్‌బై

ప్రధాని నరేంద్ర మోడీ వ్యవహారశైలి మారటం లేదు. పదవులు ఇచ్చినప్పుడున్న నమ్మకం తరువాత దశలో ప్రధానిపై మేధావులకు ఉండటం లేదనడానికి ఉదాహరణంగా ఇటీవల జరిగిన సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ప్రభుత్వ కనుసన్నల్లో మెలగడం ఇష్టంలేని మేధావులు తమకు తాముగా పదవుల నుంచి వైదొలగుతున్నారు. ఇటీవల కాలంలో రెండు ప్రధాని పదవులను నిర్వహిస్తున్న ఇద్దరు మేధావులు వైదొలగడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి అద్దం పడుతోంది. ఆర్ధికవేత్తలైనా, శాస్త్రవేత్తలైనా ఆయన కనుసన్నల్లోనే నడుచుకోవాలి. అలా నడుచుకోలేని మాజీ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ రఘురాజన్ పదవీ విరమణ చేశారు. పదవిలో ఉన్నతంకాలం ఆయనకు వ్యతిరేకంగా బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి పదేపదే విమర్శలు గుప్పించారు. మోడీ వ్యవహారశైలి నచ్చక,స్వేచ్ఛగా పనిచేసే అవకాశాలు లేక పదవులు వదిలేందుకు సిద్ధపడుతున్న అధికారులు చాలామంది ఉన్నారని అంటున్నారు. దాదాపు ఏడు దశాబ్దాల నుంచి దేశంలో అమలులో ఉన్న ప్రణాళిక సంఘాన్ని ఒకేఒక కలం పోటుతో రాత్రికి రాత్రి రద్దుచేసి దాని స్థానంలో నీతి అయోగ్‌ను ప్రారంభించారు. దాని నిర్వహణా బాధ్యతను పనగరియాకు అప్పగించారు. ఆయన తన దారి తాను చూసుకోవడంతో కింకరక్తవ్యం అన్నట్టు మోడీ ఉండిపోయే పరిస్థితి, ప్రణాళికా సంఘం స్థానంలో ప్రారంభించిన నీతి ఆయోగ్ పాత సీసాలో కొత్త సారాయే తప్ప ప్రజలకు దానివల్ల ఒనగూడే ప్రయోజనం శూన్యమనే భావన మేధావులకే కాదు, సామాన్యులకూ, ఏర్పడింది. కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉన్న పనగరియాకు నీతి ఆయోగ్ పదవిని కట్టబెట్టినప్పుడు దీనిపై ప్రజలెన్నో ఆశలు పెట్టుకున్నారు.

**మొన్న ఆర్బీఐ గవర్నర్, నిన్న నీతి అయోగ్ వైస్**



2015లో దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడు తోందనే ఆశలున్న సమయంలో సోషలిస్టు తరహా ఆర్థిక వ్యవస్థకు అనుకూలంగా ఉన్న ప్రణాళికా సంఘం రద్దయింది.

దేశ ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పులు తేవాలని ప్రభుత్వం భావిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయని అప్పట్లో పెద్దయెత్తున ప్రచారం జరిగింది. కానీ, ప్రభుత్వంలో హిందుత్వ శక్తుల జోక్యం పెరగడం మేధావివర్గాన్ని కలవరపెడుతున్న తరుణంలో పనగరియా నీతి ఆయోగ్‌కు రాజీనామా చేసి, కొలంబియా యూనివర్సిటీలో తన సెలవు ముగిసందని, అందువల్ల రాజీనామా చేస్తున్నానని ప్రకటించి వెళ్లిపోవడం గమనార్హం. నీతి ఆయోగ్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ, ఫార్మస్యూటికల్ సంస్థలకు లాబీయింగ్‌లా పనిచేస్తోందని మోడీ ప్రభుత్వంలోని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. మరోవైపు బీజేపీ కార్మికసంఘం మరికొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసింది. మహిళలు అర్ధరాత్రి పని చేయడం విదేశాల్లో చెల్లుతుంది గానీ, భారత దేశానికి సరిపడదని వాదిస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని కీలక నిర్ణయాలపై తన అభిప్రాయం తెలుసుకోవడం లేదనే అసంతృప్తి కూడా నీతి ఆయోగ్‌లో నెలకొని ఉన్నది. మొత్తం ఆర్థిక వ్యవస్థలో 86 శాతం ఉన్న నగదు చలామణీని ఒక్కమారుగా తీవ్ర ప్రతిష్టంభనకు గురిచేసిన పెద్దనోట్ల రద్దు ఫలితంగా ఏర్పడిన కష్టనష్టాల నుంచి ప్రజలు తేరుకోకముందే వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమలులోకి తెచ్చేందుకు ప్రభుత్వం హడావుడి ప్రయత్నాం చేసింది. ఇవేవీ నీతి ఆయోగ్‌తో సంప్రదించిన సందర్భాలు కనిపించలేదు. కనీసం నీతి ఆయోగ్ అభిప్రాయం తెలుసుకునే ప్రయత్నలు కూడా చేయలేదు. ఇటీవల పనగరియాకు సన్నిహితంగా ఉండే నీతి ఆయోగ్ సభ్యుడొకరు మాట్లాడుతూ, ఆదర్శ వంతమైన జీఎస్‌టీ తాను మద్దతిస్తానని, కానీ, ప్రభుత్వ నిర్ణయం తమను నిరాశకు గురిచేసిందని వ్యాఖ్యా నించడం గమనార్హం. నీతి ఆయోగ్ బాధ్యతలు స్వీకరించడానికి ముందు పనగరియా కొంతకాలం రాజస్థాన్ ప్రభుత్వ సలహాదారునిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన ఇచ్చిన సలహాలు, సూచనలను చాలా వరకు అమలులోకి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వంలో కూడా తనకు అధిక ప్రాధాన్యం లభిస్తుందని భావించి పనగరియా నీతి ఆయోగ్ బాధ్యతలు స్వీకరించారని తెలుస్తోంది. కానీ, ఆ పరిస్థితి కనిపించకపోవడం ఆయనకు నిరాశ కలిగించకపోవడం ఆయనకు నిరాశ కలిగించిందని చెబుతున్నారు.

# మేం ప్రసారం చేయం..

**న్యూఢిల్లీ :** దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ రాష్ట్రం ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగాన్ని దూరదర్శన్, ఆకాశవాణి అగర్తలా విభాగం ప్రసారరం చేయడానికి నిరాకరించడంపై వివాదం రాజుకుంటోంది. తన ప్రసంగాన్ని యథాతథంగా ప్రసారం చేయడానికి నిరాకరించడం అసాధారణం అప్రాజాస్వామికం, అసహనం, నిరంకుశత్వం అని మానిక్ సర్కార్ విమర్శించగా, స్వయం ప్రతిపత్తిగలిగిన దూరదర్శన్, ఆకాశవాణిలు కేంద్ర సమాచారం ప్రసారాల శాఖలో భాగమైనట్లు వ్యవహరించడం ఏమిటని వామపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్నారు. మళ్లీ ఎమర్జెన్సీకాలంనాటి ఆంక్షలు వస్తున్నాయని ప్రజాస్వామ్యవాదులు విమర్శిస్తున్నారు. భావ స్వాతంత్ర్యం కలిగిన ప్రజాస్వామ్య దేశంలో స్వయం ప్రతిపత్తిగల ప్రసార భారతి ఎందుకు ప్రసారం చేయలేదో ఒకసారి ప్రసంగాన్ని చూద్దాం.

**ప్రియమైన త్రిపుర ప్రజలారా!**

దేశ స్వాతత్ర్యం దినోత్సవం సందర్భంగా మీ అందరికి శు భాకాంక్షలు, స్వాతంత్ర్యం కోసం పోరడిన అమరవీరులకు నా నివాళులు స్వాతంత్ర్యం కోసం పోరాడి ఇప్పటికీ మనందరి మధ్యనున్న యోధులకు నా గౌరవ వందనాలు. స్వాతంత్ర్య దినోత్సవం అంటే సంప్రదాయ బద్ధంగా ఏటా జరుపుకేనే ఓ పండుగ కాదు. ఈ దినానికి చారిత్రక ప్రాధాన్యతతోపాటు మన భావోద్వేగాలు ముడిపడి ఉన్నాయి. ఈ సందర్భంగా మనం ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భిన్నత్వంలో ఏకత్వం మన ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భిన్నత్వంలో ఏకత్వం మన సంప్రదాయ సంస్కృతి. లౌకిక భావాల వల్లనే మన భారతీయులంతా కలసి మెలసి బతుకుతున్నారు. ఈరోజున మన లౌకిక భావానికి ముప్పు వాటిల్లుతోంది. కులమతాల ప్రాతిపదికన సమాజంలో విభజనలు తీసుకొచ్చేందుకు కుట్రలు జరుగుతున్నాయి. సంకుచిత భావాలు జాతీయ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయి. గోరక్షణ పేరిట దళితులు, మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. వారిలో అభద్రతా భావం పెరిగిపోతోంది భారత దేశంలో ఓ మత రాజ్యాన్ని స్థాపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్వాతంత్ర్య పోరాటానికి పురిగొల్పిన ఆదర్శాలు, కన్న కలలను దెబ్బతీసే



విధంగా విఛిన్నకర శక్తులు రాజ్యమేలుతున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమంతో ఏ మాత్రం సంబంధంలేని పైగా స్వాతంత్ర్య ఉద్యమాన్ని అణచి వేసేందుకు ప్రయత్నించిన జాతి వ్యతిరేకులు నేడు రకరకాల పేర్లతో చెలామణి అవుతూ దేశ ఐక్యతను, సమగ్రతలను దెబ్బతీస్తున్నారు. దేశభక్తిగల ప్రతి పౌరుడు దేశ ఐక్యతకు కట్టుబడి ఈ విఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా సంఘటితంగా నిలబడాలి అని మాణిక్ సర్కార్ పిలుపునిచ్చారు. నేడు సమాజంలో ధనిక పేద అంతరాలు పెరిగి పోతున్నాయి. అపారమైన దేశ సంపద కొద్ది మంది వ్యక్తుల చేతుల్లోకి చేరిపోగా మెజారిజీ ప్రజలు కూడు కూడా అందక కుమిలిపోతున్నారు. కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు ఊడికం చేస్తూ సామాజిక అంతరాలను పెంచి పోషిస్తున్న ప్రస్తుత ఆర్థిక సామాజిక విధానానికి ప్రత్యామ్యాయ విధానం తప్పకుండా ఉంది. మెజారిటీ పేద ప్రజలను ఆదుకునే అలాంటి ప్రత్యామ్నాయ ఆర్థిక,సామాజిక విధానాన్ని సాధించడం కోసం త్రిపుర ప్రజలంతా ఒక్కటవ్వాలి. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు భిన్నంగా రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకు ఉన్నంత పరిధిలో ఈ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇది సరిపోదు. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాన్ని సాధించడం ఒక్కటే పరిష్కారం. అందుకు జరిగే పోరాటంతో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలని కోరుకుంటున్నాను అని మాణిక్ సర్కార్ తన ప్రసంగ పాఠంలో పేర్కొన్నారు.

## ఇది చాలా దారుణం : బృందాకారత్




స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాణిక్ సర్కార్ ప్రసంగాన్ని ప్రసారం చేయడానికి డీడీ, ఏఐఆర్ నిరాకరించడాన్ని సీపీఎం ఖండిం చింది. ఇది దారుణమైన అన్యాయ మైన చర్యగా సీపీఎం నాయకురాలు బృదాకారత్ ఢిల్లీలో వర్ణించారు. రాష్ట్రాలతో సహకారాత్మక సమాఖ్య విధానం అవలంబిస్తామని చెబుతున్న ప్రధాని నరేంద్ర మోడీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. సహకారాత్మక సమాఖ్య విధానం అంటే ఇదేనా ప్రజలతో ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి ప్రసంగ పాఠంలో మార్పులు చేసే అధికారం దూరదర్శన్‌కు ఎవరిచ్చారు? ఇది దారుణం, పూర్తిగా అన్యాయమని బృందా కారత్ తీవ్రంగా విమర్శించారు.

## భగవత్ జెండా వందనం

దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తిలబిరుసుగా వ్యవహరిస్తూ కేరళ పలక్కాడ్‌లో జిల్లా యంత్రాంగం ఆదేశాలను లెక్కచేయకుండా ఓ స్కూల్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అయితే ఇందుకు జిల్లా కలెక్టర్ ఆక్షేపించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు లేక ఎన్నికైన ప్రజా ప్రతినిధి మాత్రమే త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాంటూ కలెక్టర్ పి. మేరికుట్టి స్కూలు యాజమాన్యానికి లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీచేసినా భగత్ వాటిని బేఖాతరు చేశారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ కేసు నమోదు చేయాల్సిందిగా పోలీసులకు సూచించారు

**పాలక్కడ్ కలెక్టర్ బదిలీ**


ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తూ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కారించుకుని ఒక ప్రభుత్వ పాఠశాలలో జాతీయ పతాకాన్ని ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ ఎగురవేయడంతో పాలక్కడ్ జిల్లా కలెక్టర్‌ను గురువారం కేరళ ప్రభుత్వం బదిలీ చేసింది. బదిలీ అయిన ఐదుగురు కలెక్టర్లలో పి.మేరీకుట్టి ఒకరు. ఇదిలా ఉండగా, స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో జాతీయ జెండాను కేవలం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులను మాత్రమే అనుమతిస్తూ సీపీఎం నేతృత్వంలోని కేరళ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను భగవత్ త్రోసిరాజని పతాకాన్ని ఆవిష్కరించి, ప్రసంగించారు. మేరీకుట్టిని ప్రస్తుతం పంచాయతీ డైరెక్టర్‌గా నియమించారు.



# యుక్తితో పోరాడిన అజీముల్లా


**అజీముల్లా ఖాన్ (1859)**

11 స్వదేశీ పాలకులు, సంస్థానాధీశులు బ్రిటిష్ పాలకులపై మండిపడుతున్న రోజుల్లో శక్తి కంటే యుక్తి మంచి ఫలితాలనిస్తుందని భావించి 1857 నాటి పోరాటాలకు వ్యూహరచన చేసిన మేధావులలో ఒకరుగా ఖ్యాతిగాంచిన అజీముల్లా ఖాన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జన్మించారు. చిన్నతనంలోనే ఆంగ్లం, ఫ్రెంచి భాషలను నేర్చుకున్న ఆయన కాన్పూరు విద్యాలయంలో విద్యార్థిగా చేరారు. అక్కడ విద్యాభ్యాసం తరువాత ఆ విద్యాలయం అధ్యాపకుడయ్యారు. అజీముల్లా ఖాన్ ప్రతిభ గురించి విన్నకాన్పూరు అధినేత నానా సాహెబ్ పీష్వా తన పక్షాన వకీలుగా బాధ్యతలు నిర్వహించేందుకు ఆహ్వానించారు. ఆ ఆహ్వానం మీద ఆయన ఇంగ్లాండు వెళ్ళి అక్కడ రెండేళ్ళు గడిపారు. ఆ సందర్భంగా బ్రిటిషర్ల రాజకీయాలను, వారి ప్రవర్తనను, వ్యవహార సరళిని గమనించిన ఆయన ఇండియాకు తిరిగి వస్తూ పలు ఇతర దేశాలను పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన మాల్టా చేరుకున్నప్పుడు, ఆంగ్లో-ఫ్రెంచి సైన్యాలను రష్యా సైన్యాలు మాల్టా వద్ద పరాజయం పాల్జేయడం గురించి తెలుసుకున్నారు. ఆ కారణంగా రష్యా సైనికపాటవాన్ని పరిశీలించేందుకు అజీముల్లా ఖాన్ అటునుండి కానిస్టాంటునోపుల్ వెళ్ళారు. ఆ తరువాత ఫ్రాన్స్, క్రీమియాలను సందర్శించి ఆయా దేశాల దేశాల రాజకీయాలను, యుద్ధ ప్రక్రియలను అధ్యయనం చేశారు. స్వేచ్ఛా-స్వాతంత్ర్యాల కోసం ప్రజలు సాగించిన



పోరాటాలను గమనించారు. ఆ క్రమంలో అజీముల్లాలో దాగి ఉన్న స్వతంత్ర-స్వేచ్ఛాయుత ఆలోచనలకు మరింతగా పదునుపెట్టాయి. ఆ సందర్భంగా ఇండియాలో బ్రిటిష్ పాలనాధికారానికి చరమగీతం పాడేందుకు తమతో సహకరించే పలు దేశాలు అధినేతలతో రహస్య స్నేహ సంబంధాలను కుదుర్చుకునేందుకు ఆయన ప్రయత్నించారు. ఇండియా తిరిగి వచ్చాక నానాసాహెబ్‌తో తన ఆలోచనలను పంచుకుని 1857 నాటి చారిత్రక కాన్పూరు తిరుగుబాటుకు వ్యూహరచన చేశారు. ఈ మేరకు అంతా తమతో కలసి రావాల్సిందిగా కోరుతూ స్వదేశీ పాలకులకు, సైనికులకు నానాసాహెబ్ పేరిట అజీముల్లా ఖాన్ లేఖలు రాశారు. ఆంగ్లేయుల మిద ఎందుకు ధ్వజమెత్తాలో ఆ లేఖలలో సవివరింగా పేర్కొన్నారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ప్రజలను, స్వదేశీ సైనికులను కూడగట్టేందుకు పయామ్- యే- ఆజాది' అను పత్రికను హిందీ, ఉర్దూ భాషల్లో వెలువరించారు. ఆనాటి పోరాటాలలో నానా సాహెబ్‌తో పాటు బేగం హజరత్ మహల్, మౌల్వీ అహ్మదుల్లా షాహ్, ఝాన్సీ లక్ష్మిబాయి, మొగల్ రాకుమారుడు ఫిరోజ్ షాహ్, తాంతియా తోపేల లాంటి యోధులకు ఆయన మేధోపరమైన సేవలను అందించారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం పరాజయం అంచుకు చేరుకునేసరికి నానా సాహెబ్, హజరత్ మహల్, ఫిరోజ్ షా తదితరులతో ఆయన నేపాల్ అడవుల్లోకి నిష్క్రమించారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తుదకంటా పోరాడేందుకు అవసరమైన బలగాలను, ఆర్థిక సాధన సంపత్తిని సమకూర్చుకునే ప్రయత్నంలో అష్టకష్టాలు పడుతూ, నేపాల్ అడవుల్లోని భుట్‌వాల్ ప్రాంతంలో అజీముల్లా ఖాన్ 1859 అక్టోబరు మాసంలో కన్నుమూశారు.

**(ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు ఆల్బమ్ 'చరితార్థులు' నుంచి....)**



**Syed Naseer Ahamed**
**Mobile: 9440241727.**
**E-mail: naseerahamedsyed@gmail.com**

# మన కోసం

| | | | | |
|---|---|---|---|---|
| | శ్రీ విజయలక్ష్మీ జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| రెస్టారెంట్స్ | బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| | స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| | ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |
| షాప్స్ | రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| | వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| | బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| | కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| | వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్‌వి. పున్నారావు | 9848407935 |
| | చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| | ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| | అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| ట్రేడర్స్ | సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| | శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |

**మ్యారేజీ లింగ్స్**

| | | |
|---|---|---|
| షేక్ జానీ | విజయవాడ | 9948450761 |

## యాక్సిస్ బ్యాంక్ 'శుభ్ ఆరంభ్'

**అందుబాటులోని కొత్త గృహ రుణ పథకం కొన్ని ఎంఐల మాఫీ ప్రయోజనం**



**ముంబై :** ప్రైవేట్ రంగం యాక్సిస్ బ్యాంకు కొత్తగా శుభ్‌ఆరంభ్ పేరిట మరో రుణ గృహ పథకాన్ని ప్రవేసపెట్టింది. రుణ చెల్లింపులు వ్యవధిలో కొన్ని నెలల వారి చెల్లింపులకు ఈ ఎంఐ (మినహాయింపు లభించేలా ఈ పథకాన్ని తీర్చి దిద్దారు. నాలుగు, ఎనిమిది , పన్నెండు సంవత్సరాలు చివరల్లో నాలుగు, ఈఎంఐలను బ్యాంకు మాఫీ చేస్తుంది. ఇలా 27 ఏళ్ల వ్యవధికి రుణం తీసుకున్నవారికి మొత్తం మీద 12 ఈఎంఐల మేర మాఫీ లభిస్తుంది. సుమారు రూ.30 లక్షల రుణంపై మొత్తం మీద రూ.3.09 లక్షల మేర ఆదా అవుతుందని బ్యాంక్ తెలిపింది. రూ.30 లక్షల దాకా గృహ రుణాలకు ఈ పథకం వర్తిస్తుందని, రుణ చెల్లింపు వ్యవధి తగ్గింపు రూపంలో ఈ ప్రయోజనం అందిస్తామని వివరించింది. ఆ సొంతం వడ్డీ రేటు స్థిరంగా 8.35 శాతం గానే కొనసాగుతుందని పేర్కొంది. ఒకవేళ ఏ ఒక్క ఈఎంఐని చెల్లించకపోయినా.. వారికి ఈ పథకం ప్రయోజనాలు లభించవు.

# సబ్సిడీపై ఉల్లి

- మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర నుంచి దిగుమతి
- అక్రమ నిల్వలపై దాడులు చేయండి
- టెలీ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

**రా.వా ప్రతినిధి, అమరావతి :** రాష్ట్రంలోని అన్ని రైతు బజార్‌లలో ఉల్లిపాయలను సబ్సిడీ ధరలకే విక్రయించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అన్ని రైతు బజార్‌లలోనూ ఉల్లిపాయలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అవరమైతే మధ్యప్రదేశ్,మహారాష్ట్ర, గుజరాత్ నుంచి ఉల్లిపాయలను దిగుమతి చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉల్లిపాయ ధరలు ఒక్కసారిగా పెరగటం, బహిరంగ మార్కెట్‌లో కృత్రిమ కొరత నెలకొనటంతో సీఎం చంద్రబాబు వ్యవసాయశాఖ, పౌరసరఫరాలు, మార్కెటింగ్, రైతు బజార్‌ల సీఈఓలతో ఉండవల్లిలోని తన ఇంటి నుంచి టెలీ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉల్లి ధరకు సబ్సిడీ ఇచ్చి రైతు బజార్‌లలో విక్రయించేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఉల్లిపాయలు అక్రమంగా నిల్వలు చేసేవారిపై దాడులు నిర్వహించి నియంత్రించాలని మార్కెటింగ్, పైరసరఫరాలశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఉల్లిపాయల కొరత ఉందో ప్రజలు 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఫిర్యాదు అందిన వెంటనే ఆయా ప్రాంతాలలో ఉల్లిపాయల కొరతను అధిగమించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయలను సేకరించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. రైతు బజార్‌లలో పూర్తిస్థాయిలో ఉల్లిపాయలు అందుబాటులో ఉండేందుకు ప్రతి రెండు గంటలకు ఒకసారి సమీక్షించాలని మార్కెటింగ్, పౌరసరఫరాలశాఖ కమిషనర్‌లు, రైతు బాజర్ సీఈఓకు సీఎం సూచించారు.

## రాజధానిలో జీ+ఎఫ్4 ఆపార్ట్‌మెంట్‌కు అనుమతి

**రా.వా. ప్రతినిధి, రాయపూడి :** నవ్యాంధ్ర రాజధానిలో మొట్టమొదటి సారిగా జీ+ఎఫ్4 ఆపార్ట్‌మెంట్‌కు అనుమతి ఇచ్చినట్లు సీఆర్‌డీఏ అధికారులు రమణరావుకు తెలిపారు. ఈ ఆపార్ట్‌మెంట్‌లో 12 అంతస్తుల భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు.

# వారధి కూడలిలో 'బుద్ధ చక్ర'

- 24, 25 తేదీల్లో ప్రభుత్వ భవనాల ఆకృతులు
- దసరా రోజు నిర్మాణ పనులకు శ్రీకారం
- కృష్ణానదిపై 5 ఐకానిక్ వంతెనలు
- సీఆర్‌డీఏపై సమీక్షించిన చంద్రబాబు

**రా.వా ప్రతినిధి- అమరావతి :** సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి ఆధ్వర్యంలో రూపొందించిన వారధి కూడలిలో ప్రతిపాదించిన బుద్ధ చక్రకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోద ముద్ర వేశారు. బుద్ధ చక్రకు సంబంధించి కొన్నిఆకృతులను సమావేశంలో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) సమర్పించింది. వెలగపూడి సచివాలయంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ)పై ముఖ్య మంత్రి చంద్రబాబు సమీక్షించారు. కూడలి వద్ద 27 అడుగుల ఎత్తులో బుద్ధ చక్రను రూపొందించనున్నట్లు ఏడీసీ సీఎండీ లక్ష్మి పార్ధసారథి తెలిపారు. బేస్‌మెంట్‌తో కలుపుకుని కట్టడం మొత్తం 40 అడుగుల మేర ఉంటుందన్నారు. బుద్ధ చక్రను మొత్తం శాండ్ స్టోన్‌తో నిర్మిస్తారన్నారు. దీని తయారీకి ప్రత్యేక యంత్ర సామాగ్రిని ఉపయోగించనున్నట్లు ఆమె వివరించారు. నాలుగు నెలల వ్యవధిలో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, ఇందుకు రూ. 9 కోట్లు కేవలం రాతి నిర్మాణానికే ఖర్చు కాగలదని అంచనా వేసినట్లు తెలిపారు. మొత్తం కట్టడాన్ని 2018 జనవరి నాటికల్లా పూర్తి చేస్తామన్నారు. శాసనసభ, హైకోర్టు భవంతులపై ముఖ్యమంత్రి చేసిన సూచనలకు అనుగుణంగా కొత్త ఆకృతులు సిద్ధం చేసినట్లు ఫోస్టర్ అండ్ పార్టనర్స్ ప్రతినిధులు తెలిపారు. వీటితో పాటు అమరావతిలో పరిపాలన నగరానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై 400 పేజీ ల నివేదికను ఈ నెల 24,25 తేదీలలో ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి ఈ బృందంతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గత సమావేశంలో ముఖ్యమంత్రి చెప్పిన మార్పుల ప్రకారం శాసనసభ భవంతిరి కోహినూర్ వజ్రాకారంలో, హైకోర్టు భవంతిని బౌద్ధ స్థూపాకారంలో మార్పు చేసి, ఈ నవీన ఆకృతులకు రూపకల్పన చేసినట్టు ఫోస్టర్స్ బృందం ప్రతినిధి క్రిష్ ముఖ్యమంత్రికి వివరించారు. హైకోర్టు భవంతికి సంబంధించిన నిర్మాణ, విస్తరణ వ్యూహాలు, వినియోగించాల్సిన భవ నిర్మాణ సామాగ్రి గురించి ఫోస్టర్స్ ప్రతినిధులు తమ ప్రెజెంటేష్ ద్వారా తెలిపారు. రాజధానిలో కొత్తగా నిర్మించిన పోలీస్ హెడ్ క్వార్టర్స్ భవంతుల గురించి ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. చుట్టూ పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణంలో ఐకానిక్ కట్టడాలుగా వీటిని తీర్చిదిద్దారని ప్రశంసించారు. రాజధానిలో నిర్మించే ప్రతి భవంతి... ఇలా విలక్షణంగా ఉండాలన్నారు. తాము సూచించిన ఆకృతులకు తగినట్టు నిర్మాణాలు చేపట్టడంలో ఏమైనా పరిమితులు, ఇబ్బందులు ఉంటే తెలియజేయాలన్నారు. ముందస్తుగా మరికొన్ని ప్రత్యామ్నాయ ఆకృతులను సిద్ధం చేసి పెట్టుకోవాలని సీఎం ఫోస్టర్స్ బృందానికి సూచించారు. అంతిమంగా ఇవి ప్రపంచంలోనే అత్యుత్తమ నిర్మాణాలుగా పేరు తెచ్చుకోవాలన్నదే తన ఉద్దేశమని చెప్పారు. సెప్టెంబరు 30న దసరా పర్వదినం సందర్భంగా నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించామని, ఈలోపు తుది ఆకృతులు, నవివర ప్రణాళికలు సిద్ధమయ్యేలా గడువు పెట్టుకున్నామని సీఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ముఖ్యమంత్రికి వివరించారు. శాఖమూరు పార్కును ప్రహరీ గోడ లేకుండా నిర్మించాలని ముఖ్యమంత్రి చేసి సూచన మేరకు ఏడీసీ కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసి సమావేశం ముందుంచింది. రాజధానిలోని ఏ నిర్మాణానికీ ప్రహరీ అవసరం లేకుండానే అందమైన ప్రవేశ ద్వారాలతో తీర్చిదిద్దాలని సీఎం చెప్పారు. పవిత్ర సంగమం నుంచి పరిపాలన నగరానికి వెళ్ళేందుకు కృష్ణానదిపై నిర్మించ తలపెట్టిన ఐకానిక్ బ్రిడ్జిపై ఈ సమావేశంలో కొన్ని ప్రతిపాదనలను ముఖ్యమంత్రి పరిశీలించారు. రాజధాని ప్రాంతంలో మొత్తం 5 ఐకానిక్ వారధులు రానున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. పురపాలన శాఖ మంత్రి పీ నారాయణ, సీఆర్‌డీఏ కార్యదర్శి అజయ్ జైన్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర, అదనపు కార్యదర్శి ఏవీ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# చైనా ఫోన్లతో చేటు తప్పదా?



## బిజినెస్

చైనా ఫోన్లతో పెను ప్రమాదం పొంచి ఉందా? వినియోగదారులకు సంబంధించిన అత్యంత కీలకమైన సమాచారం ఈ ఫోన్ల ద్వారా డ్రాగన్ దేశానికి చేరుతోందా? అదే జరిగితే పరిస్థితి ఏంటి? ఎలాంటి విపత్కర పరిణామాలు ఎదురవుతాయి? ఎంత నష్టం వాటిల్లుతుంది? ఇలాంటి ప్రశంశలు మేధావుల నుంచి సాధారణ జనం వరకు అందరి మదిని తొలుస్తున్నాయి. డోక్లామ్ విషయమై చైనా, భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో చైనా కంపెనీల ఫోన్లపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే తరుణంలో వినియోగదారుల డేటా సెక్యూరిటీకి సంబంధించి ఎలాంటి విధానాలను అనుసరిస్తున్నారో తెలియజేయాలని ప్రభుత్వం భారత్‌లో మొబైల్ ఫోన్లను విక్రయిస్తున్న 21 కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. ఈ కంపెనీల్లో దేశీయ కంపెనీలే కాకుండా చైనా కంపెనీలు, ఇతర దేశాల కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే వీటిలో అత్యధికంగా ఉన్న విదేశీ కంపెనీల్లో చైనా కంపెనీలే ఎక్కువగా ఉన్నాయి.

**డేటా చోరీ జరిగితే..**

స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్న వారిలో అనేక మంది డిజిటల్ చెల్లింపులు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆన్‌లైన్ షాపింగ్, మొబైల్ ఫోన్ల రీచార్జులు, సినిమా టికెట్ల బుకింగ్స్, బ్యాంకింగ్ లావాదేవీలు వంటి అనేక సర్వీసులను మొబైల్ ఫోన్ ద్వారానే వినియోగించుకునే వారు కోకొల్లలు. పెద్ద నోట్ల రద్దు తర్వాత మొబైల్‌లోని వివిధ యాప్‌లను వినియోగిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరిపే వారు తమ డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపులు జరుపుతుంటారు. కొంత మంది తమ కార్డులకు సంబంధించిన వివరాలను ఫోన్లలోనే ఉంచుతుంటారు. ఫోన్‌లోని యాప్‌ల ద్వారా ఆర్థిక లావాదేవీలు జరిపిన సందర్భంలో తమకు సంబంధించిన వివరాలు గోప్యంగా ఉంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కానీ ఆ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతిలో పడితే ఎంతటి నష్టమైనా జరగవచ్చు. ఇప్పటికే సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాల గురించి రోజూ వార్తలు వింటూనే ఉన్నాం. చాలా మంది నేరగాళ్లు బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ డెబిట్ కార్డు వివరాలు తెలుసుకుంటూ ఖాతాలోని సొమ్మును ఖాళీ చేస్తున్నారు. ఇప్పుడు ఇలాంటి వారికి మొబైల్ ఫోన్‌లో ఉండే డేటా దొరికితే ఇంకేమైనా ఉందా? ఇంకా చాలా మంది తమ ఫోన్‌లో కీలకమైన డాక్యుమెంట్లు, ఇతర వివరాలను కూడా ఉంచుకుంటారు. ఇలాంటి వారి డేటా మరొకరి కంట పడితే ఎంతటి అంతే సంగతులు. చాలా మంది ఇష్టారాజ్యంగా అప్లికేషన్లను డౌన్‌లోడ్ చేస్తుంటారు. వీటిలో ఏది సరైందో ఏది సరికాదో తెలియని వారు ఎంతో మంది ఉంటారు. ఈ నేపథ్యంలో వినియోగదారుల డేటా సెక్యూరిటీకి కంపెనీలు అనుసరిస్తున్న విధానాలను తెలియజేయాలని ప్రభుత్వం మొబైల్ ఫోన్ల కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది.

**దేశీ మొబైల్ ఫోన్ల మార్కెట్లో చైనా కంపెనీల పాగా**

మన దేశంలో మొబైల్ ఫోన్ల మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. అమెరికాను తోసిరాజనం మన దేశం స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో రెండోస్థానం కైవసం చేసుకుంది. మొదటి స్థానంలో చైనా కొనసాగుతోంది. గత ఏడాది మన దేశంలో 10 కోట్లకు పైగా స్మార్ట్‌ఫోన్లు అమ్ముడయ్యాయి. వీటిలో చైనా కంపెనీలు తయారు చేసినవే అత్యధికంగా ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. సెక్యూరిటీ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని చైనా ఫోన్ల దిగుమతిని నిలిపివేయాలన్న యోచన చేసింది. ఐఎంఇఐ నెంబర్ లేని ఫోన్లను భారత్‌లోకి అనుమతించవద్దని నిర్ణయించింది. ప్రస్తుతం మన దేశంలో చైనాకు చెందిన అల్కటెల్, కూల్‌ప్యాడ్, జిఫైవ్, జియోనీ, హేయర్, హువావే, లెనోవో, షామీ, వివో, ఎల్ఇటీవీ, మీజు,వన్‌ప్లస్, ఒప్పో, జోపో, జెడ్‌టిఇ వంటి కంపెనీలు తమ ఫోన్లను విక్రయిస్తున్నాయి. తొలుత ఇకామర్స్ సైట్ల ద్వారా ఫోన్లను విక్రయించిన పలు కంపెనీలు ఇప్పుడు రిటైల్ స్టోర్ల ద్వారా అమ్మకాలను పెంచుకునే పనిలో పడ్డాయి. ఆకర్షణీయమైన రూపం, అత్యాధునిక ఫీచర్లతో కూడిన ఫోన్లను ఈ కంపెనీలు తక్కువ ధరలకే అందిస్తుండటం వల్ల జనాలు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. ఇదే చైనా కంపెనీలకు వరంలా మారింది. 120 కోట్లకు పైగా జనాభా కలిగిన మన దేశంలో టెలికాం సేవలు వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రజల ఆదాయాలు వృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో స్మార్ట్‌ఫోన్లను కొనుగోలు చేసే జనం బాగా పెరిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఒక కంపెనీ తర్వాత మరో కంపెనీ అన్నట్టుగా చైనా కంపెనీలు భారత్‌లో పాగా వేస్తున్నాయి.

**50 శాతానికి పైగా వాటా చైనా కంపెనీలదే..**

దేశీయ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో చైనా కంపెనీలు క్రమంగా విస్తరిస్తున్నాయి. తక్కువ ధరలోనే అత్యాధునిక ఫీచర్లతో కూడిన స్మార్ట్‌ఫోన్లను తేవడంతో వినియోగదారులకు పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరుపుతున్నారు. దేశీయ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో ప్రస్తుతం చైనా కంపెనీల వాటాయే 50 శాతానికి పైగా ఉంది. గత మార్చి త్రైమాసికం నాటికే ఈ లెక్క ఇప్పటి వంకు చూస్తే ఇది ఇంకా పెరిగి ఉండవచ్చు. ఇక సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ 28 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. గత ఏడాది మార్చి త్రైమాసికంలో ఈ కంపెనీ వాటా 25 శాతం ఉండేది. చైనా కంపెనీల పెత్తనం కొనసాగుతున్న నేపథ్యంలో గత ఏడాదిలో 40 శాతంగా ఉన్న దేశీయ కంపెనీల మార్కెట్ వాటా 14 శాతానికి దిగజారిపోయింది. గత ఆర్థిక సంవత్సరంలో ఒప్పో, వివో ఇండియాల అమ్మకాలు ఏడు నుంచి తొమ్మిది రెట్లు పెరిగాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఈ రెండు కంపెనీల అమ్మకాలు 40-50 శాతం మేర పెరగడానికి అవకాశం ఉందని ఇండియా రేటింగ్స్ అంచనా వేస్తోంది.

**దేశంలోనే మొబైల్ ఫోన్ల తయారీ యూనిట్లు**

భారత్‌లో మొబైల్ ఫోన్ల మార్కెట్ ఊహించిన స్థాయికన్నా భారీగా పెరుగుతోంది. ఇదే తరుణంలో మేక్ ఇన్ ఇండియాకు ప్రధాన నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఇదే సరైన అవకాశంగా భావించిన చైనా కంపెనీలు మన దేశంలో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు రచించాయి. చైనా కంపెనీ షామీ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో మొబైల్ ఫోన్లను తయారు చేస్తున్నాయి. నొయిడా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ సమీపంలో మరికొన్ని కంపెనీలు ఫోన్లను ఉత్పత్తి చేస్తున్నాయి. ఆన్‌లైన్ ద్వారా పెద్ద ఎత్తున అమ్మకాలను పెంచుకున్న నేపథ్యంలో ఇప్పుడు రిటైల్ స్టోర్ల ద్వారానూ విక్రయాలు పెంచుకోవడానికి ఈ కంపెనీలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. బాలీవుడ్, టాలీవుడ్ నటులను ప్రచారకర్తలుగా నియమించుకుంటూ పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నాయి.

**చైనా హెచ్చరికలు...**

డోక్లామ్ విషయంలో భారత్, చైనాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌లో పెట్టుబడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పునరాలోచన చేయాలని అక్కడి మీడియా కథనాలు వెలువరిస్తోంది. ఈ నేపథ్యంలో పలు కంపెనీలు తమ ఆలోచనా విధానాలను మార్చుకుంటున్నాయి. ఇదిలా ఉంటే.. చైనా ఉత్పత్తులు భారత్‌కు రాకుండా చర్యలు తీసుకోవాలన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అయితే తమ ఉత్పత్తులు రాకుండా చేయడం వల్ల భారత్‌కే నష్టమని చైనా అంటోంది. చవక ఉత్పత్తులను తయారు చేస్తున్న చైనా వాటిని మన దేశంలోకి పెద్ద ఎత్తున పంపిస్తోంది. మన దేశంలో భారీ ఎత్తున జనాభా పెరిగిపోతున్న ఫలితంగా ఇక్కడి అవసరాలు చైనా ఉత్పత్తుల ద్వారానే తీరుతున్నాయని చెప్పవచ్చు. చైనా ఉత్పత్తులకు అడ్డుకట్ట వేయాలంటే మన దేశంలో ఉత్పత్తి పెరగాలి. అది అనుకున్నంత సులభం కాదు. కాబట్టి చైనా సరుకులను ఇప్పుడప్పుడే అడ్డుకునే అవకాశం ఉండకపోవచ్చని అంటున్నారు.

– ఖాన్

# ప్రభుత్వాలవి రైతు వ్యతిరేక విధానాలు

- స్థిరత్వ సాధనతోనే రైతుకు గిట్టుబాటు
- డా. స్వామినాథన్ వెల్లడి



న్యూఢిల్లీ : 2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న బీజేపీ ప్రభుత్వ హామీని గురించి ప్రశ్నించగా ఆహార ధర ద్రవ్యోల్బణం తరహాలోనే ఈ తన సారథ్యంలోని కమిటీ సిఫారసులనూ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. ఈ దేశంలో సగానికి పైగా ఉన్న శ్రామికవర్గానికి ఆహారం అవసరం లేదనే విధంగా ప్రభుత్వ వైఖరి ఉందని ఆయన ఘాటుగా విమర్శించారు. ఏడవ వేతన సంఘం సిఫారసు చేసిందంటూ ఉద్యోగుల జీతభత్యాలను పెంచడానికి వెనుకాడని ప్రభుత్వం గత కొన్ని దశాబ్దాలుగా రైతాంగం డిమాండ్ చేసే గిట్టుబాటు ధర కల్పన విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు. రుణ మాఫీలనేవి జనాకర్షణకేనన్నారు. 2009లో యూపీఏ ప్రభుత్వం ఏకంగా రూ.72,000ల కోట్ల మొత్తాన్నీ మాఫీ చేసి రైతులను ఆదుకున్నామని ప్రకటించుకుందన్నారు. అయితే రైతులకు గిట్టుబాటు ధర కల్పనకుగాను కేవలం రూ.20 వేల కోట్ల కేటాయింపులు జరపక పోవడం రాజకీయం కాక ఏమిటని ఆయన ప్రశ్నించారు. రైతుల ఆదాయాలు పెరగడానికి కనీస మద్దతు ధర, సేకరణ, ఉత్పాదకత పెంపుదల అవసరమన్నారు. రుణ భారంతోనే లేదా గిట్టుబాటు ధర లభించలేదనే కారణంతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనే వరకే మన ఆలోచనలు పరిమితమవుతున్నాయనీ, రైతు ఆత్మహత్యల నిజానిజాలను నిగ్గుతేల్చాలంటే మరింత లోతుగా, నిశితంగా అధ్యయనం జరపాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం బాధితుల కుటుంబాలకు నష్టపరిహారాలు చెల్లిస్తే రైతుల ఆత్మహత్యలు ఆగవన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న రైతులు అప్పుల ఊబిల్లో కూరుకు పోతుంటే కనీసం వారి పిల్లల చదువుసంధ్యలకూ సాయం చేయడంలోనూ ప్రభుత్వాలు అలక్ష్యం వహిస్తున్నాయన్నారు. చైనాలో మొత్తం వ్యవసాయ క్షేత్రాలన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయన్నారు. అక్కడ రైతులు కాంట్రాక్టర్ల పాత్రకే పరిమితమవుతారన్నారు. అదే మన దేశంలో సాగు భూములు రైతుల హక్కుభుక్తంలో ఉంటాయన్నారు. ఈ క్రమంలో భారీగా విస్తరించిన రైతులను అందరినీ ఒకే గాటన కట్టేయలేమన్నారు. 1967-68 లో ప్రారంభమైన హరిత విప్లవం తాత్కాలికంగా ఆహార సంక్షోభ సమస్యను పరిష్కరించిందన్నారు.


# రాయితీ రేటుతో రైతుకు రుణాలు

- పరిమితి రూ. 3లక్షలు, వడ్డీ 7 శాతం
- ఆధార్ అనుసంధానం అనివార్యం : ఆర్బీఐ

ముంబై : ప్రభుత్వ విధానానికి అనుగుణంగా రాయితీ వడ్డీకి రూ.3 లక్షల వరకు రైతులు స్వల్పకాలిక రుణాలను పొందవచ్చని భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) తెలిపింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను వడ్డీ రాయితీ పథకం (ఇంటరెస్ట్ సబ్‌వెన్షన్ స్కీం) కింద స్వల్పకాలిక రుణాలు తీసుకునే రైతులు తమ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. ఇలా తీసుకున్న స్వల్పకాలిక రుణాలపై వడ్డీ రేటు7 శాతం ఉండగా నిర్ణీత గడువులోగా రుణ చెల్లింపులు సక్రమంగా జరిపినట్లయితే వడ్డీ నాలుగుశాతంగానే ఉంటుందని తెలిపింది. దేశంలోని బ్యాంకులన్నిటికీ ఆర్బీఐ ఈమేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. స్వీయ వనరు నుంచి రైతులకు స్వల్పకాలిక పంటరుణాలను మంజూరు చేసిన గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని బ్యాంకులకు 2శాతం వడ్డీ రాయితీని వర్తింపజేయాలని ఆర్బీఐ నిర్ణయించింది. ఒక ఏడాది కాల పరిమితికి లోబడి రుణం జారీ అయిన తేదీ నుంచి బ్యాంకులు నిర్ణయించిన గడువు లేదా రైతులు వాస్తవంగా చెల్లించే తేదీల్లో ఏది ముందయితే దాన్ని పరిగణనలోకి తీసుకుని జారీ అయిన పంట రుణం మొత్తం మీద 2 శాతం వడ్డీ రాయితీని సజావుగా బకాయిలు చెల్లించే రైతులకు లభ్యమవుతుందని తెలిపింది ఇదే క్రమంలో 2017-18 సంవత్సరానికిగానూ తీసుకున్న స్వల్పకాలిక పంట రుణాను తీసుకున్న రోజు నుంచి ఒక ఏడాది లోగా తిరిగి చెల్లించిన రైతులకు వడ్డీ నాలుగుశాతమేనని తెలిపింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను స్వల్పకాలిక పంట రుణాలపై వడ్డీ రాయితీ పథకం మొత్తం వ్యయాన్ని రూ.20,339కోట్లను కేబినెట్ ఆమోదించింది.

గిట్టుబాటు ధర లభించని మార్కెట్ పరిస్థితిలో అయినకాడికి తెగనమ్ముకునే రైతులు తమ వ్యవసాయోత్పత్తులను ప్రోత్సహించేందుకుగాను కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టింది. ఈపథకం కింద సన్న, చిన్నకారు రైతులు తమ పంటలను నిల్వ ఉంచుకోవచ్చు ఇలా గోదాముల్లో నిల్వ ఉంచిన పంట నిల్వతాలుకు రశీదులను సమర్పించడం ద్వారా పంట రుణాలను పొందే అవకాశాన్ని కల్పించారు. అయితే సదరు గోదాము లేదా గిడ్డంగి విధిగా వేర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ రెగ్యులేటరల అధారిటీ (డబ్ల్యుడీఆర్ఏ) గుర్తింపు పొంది ఉండాలని ప్రభుత్వం తెలిపింది. కాగా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం వాటిల్లిన సందర్భాల్లో పునర్వ్యవస్థీకరించిన రుణాలపై మొదటి సంవత్సరానికిగాను 2శాతం వార్షిక వడ్డీ రాయితీని ఆయా రుణాలు మంజూరు చేసిన బ్యాంకులకు జమ చేయడం జరుగుతుందని ప్రభుత్వం వివరించింది. ఈతరహా రుణాలకు రెండవ సంవత్సరం నుంచి సాధారణ వడ్డీరేటు వర్తిస్తుందని తెలిపింది.

# పార్వతీ తనయా
# పాహిమాం.. పాహిమాం..



వినాయక చవితి భారతీయ పండుగలలో ఒకటి. పార్వతీపరమేశ్వరుల పుత్రుడైన వినాయకుడి పుట్టిన రోజు. పురాణ గాథలలో శివుడు వినాయకుడిని అందరు దేవతలలోకి మిన్నగా ప్రకటించిన రోజు. వినాయకుని జ్ఞానానికి, సంపత్తుకి మరియు మంచి అదృష్టానికి దేవతగా మరియు ప్రయాణం ప్రారంభించేటప్పుడ, లేక కొత్త పనులు చేపట్టేటప్పుడు ప్రార్థించటం సర్వసాధారణం. ఈ పండుగ బాద్రపద మాసంలో శుక్ల చతుర్థి నాడు ఈ పండుగ జరుపుతారు.

### పూజా విశేషాలు

వినాయక చవితి నాడు విఘ్నేశ్వరుడిని 21 రకాల ఆకులతో పూజిస్తారు. 1. మాచీ పత్రం/మాచ పత్రి 2. దూర్వా పత్రం/గరిక 3. అపామార్గ పత్రం/ఉత్తరేణి 4. బ ృహతీ పత్రం/ములక 5. దత్తూర పత్రం/ఉమ్మెత్త 6. తులసీ పత్రం/తులసి 7. బిల్వ పత్రం/మారేడు 8. బదరీ పత్రం/రేగు 9. చూత పత్రం/మామిడి 10. కరవీర పత్రం/గన్నేరు 11. మరువక పత్రం/ధవనం, మరువం 12. శమీ పత్రం/జమ్మి 13. విష్ణుతకాంత పత్రం/ 14. సింధువార పత్రం/వావిలి 15. అశ్వత్థ పత్రం/రావి 16. దాడిమీ పత్రం/దానిమ్మ 17. జాజి పత్రం/జాజిమల్లి 18. అర్జున పత్రం/మద్ది 19.దేవదారు పత్రం 20. గండలీ పత్రం/లతాదూర్వా 21. అర్క పత్రం/జిల్లేడు.

### ఇది మనందరి పండుగ

హిందూ పండుగలలో ఒక్కో పండుగకు ఒక్కో విశేషం వుంది. ఏటా భాద్రపద శుద్ధచవితినాడు వచ్చే వినాయకచవితి మనందరి పండుగ.

హిందూ సాంప్రదాయం ప్రకారం వినాయకుడు సకల దేవతా గణానికి అధిపతి (గణనాయకుడు), అన్ని పూజలకు ప్రప్రథమంగా పూజింపవలసినవాడు. అందుకే ప్రతి శుభకార్యానికి, పూజకు మొదటిగా మనం గణపతి పూజతోనే ప్రారంభిస్తాం. అది పిల్లవాడి బారసాల, విద్యాభ్యాసం నుండి, వివాహం, శంకుస్థాపన, గృహ ప్రవేశం, వ్యాపార ప్రారంభోత్సవాలు, నూతన వాహనం కొనుగోలు ఇలా ఒక సందర్భం ఏమిటి మానవ జీవితంలో ప్రతి ప్రధానమైన శుభకార్యానికి మొదటిగా గణపతిని పూజించటం అనాదిగా సాంప్రదాయం.

ఇలా మన ప్రతి పని విజయానికీ, చదువుకు, జ్ఞానానికీ దిక్కైన దేవుడు మన వినాయకుడు. ముందుగా వినాయకుడిని సంతోష పెడితే ఆటంకాలు రాకుండా, కష్టాలు దూరమై, సకల కార్యాలు పొంది, ఐశ్వర్యాలు సిద్ధస్తాయని ప్రజల విశ్వాసం. భాద్రపదశుద్ధ చవితినాడు వినాయకుడు జన్మించినది. అన్ని విఘ్నాలపై ఆధిపత్యం జరిగినట్లుగా పురాణాల బట్టి పండితుడు తెలుపుతున్నందున మన దేశంతోపాటు ఇతర దేశాలలోని వారు కూడా ప్రతి సంవత్సరము భాద్రపదశుద్ధ చవితినాడు, బంగారం, వెండి మట్టితో తయారుచేసిన ప్రతిమలకు కుటుంబ సభ్యులు అందరూ పూజించటం వల్ల మంచి ఫలితాలు అందుతాయని పురాణకథలు తెలుపుచున్నాయి.

చవితిరోజున వినాయకుడు దగ్గర పండ్లు, పూలు, పత్రి అని పిలుచుకునే రకరకాల మొక్కల ఆకులు, పిండివంటలను వుంచి భక్తి శ్రద్ధలతో పూజిస్తూ ఆ దేవదేవుని గణగణాలను కీరిస్తాం, మనం మొదలుపెట్టే ప్రతిపనిలో ఎటువంటి విఘ్నాలు లేకుండా విజయం చేకూర్చాలని, జ్ఞానసిద్ధికోసం ప్రార్థిస్తాం.

– తిన్నలూరి. సుధాకర్



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యుద్దీకరణతో కళకళలాడుతున్న వెలగపూడిలోని సచివాలయం, అసెంబ్లీ భవనాలు







Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.
D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at 6-45/1, Rayapudi, Guntur (DT), A.P. Editor: Pattan Hussain Khan,
Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18